
సోమశిలలో 8.486 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి ప్రాజెక్టులో 8.486 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 15, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శనివారం 20 ఏప్రిల్ 2024



'నేను ఉన్నాను. నేను విన్నాను. మద్యం కారణంగా అక్కచెల్లెమ్మలు పడుతున్న బాధల గురించి తెలుసుకున్నా. మీ బిడ్డ జగన్ ఒకటే మాట ఇస్తున్నాడు. రాబోయే ఐదేళ్లలో దశలవారీగా సంపూర్ణంగా మద్యాన్ని నిషేధిస్తానని మా ఆడపడుచులకు సవినంగా మనవి చేసుకొంటున్నా'...

- పాదయాత్ర సందర్భంగా 'జగన్ ఇచ్చిన హామీ

ఐదేళ్లు గడిచిపోయాయి. కానీ ఇచ్చిన మాట మాత్రం నిలబెట్టుకోలేదు సరికదా..! మానిపోనివిధంగా పెద్ద వాతే పెట్టాడు. 2019లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఉన్న మద్యం ధరలతో పోల్చితే రెట్టింపు చేసి ఐదేళ్ల కాలంలో అక్షరాలా రూ. 2,500 కోట్లు దోచుకున్నాడు. డబ్బుపోతే పోయింది.. సరుకు అయినా మంచిదా... ? అంటే అంతా నాసిరకమే. ఐదేళ్లపాటు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన మందు కారణంగా ఇంట్లో మగాళ్ల ఆయుష్షు కూడా 20 ఏళ్లు తగ్గిపోయిందని మహిళలు ఘొల్లుమన్నారు. జే బ్రాండ్ మద్యం వల్ల లివర్ సమస్యలతోపాటు కొత్తగా బ్రెయిన్‌స్ట్రోక్‌లు కూడా వస్తున్నాయని డాక్టర్లు తేల్చారు. సంపూర్ణ మద్య నిషేధం అనే హామీతో గద్దెనెక్కి అధిక ధరల రూపంతో ప్రజాధనాన్ని, నాసిరకం మద్యంతో ప్రజారోగ్యాన్ని లూటీ చేశాడు.

నిషేధమునీ... మందులో ముంచీ!

అధిక ధరలతో మద్యం దోపిడీ రూ.2,500 కోట్లు

నాసిరకం మందుతో ఆరోగ్యాలు నాశనం

2019 టీడీపీ హయాంలో చీప్ క్వార్టర్ ధర రూ. 60 నుంచి రూ. 80 వరకు ఉండేది. కొన్ని బ్రాండ్లు రూ. 60కి లభిస్తే కొన్ని బ్రాండ్లు రూ.80. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ ధరలను అమాంతం పెంచేశారు. చీప్ ధర క్వార్టర్ రూ. 120-150. ఉంటే ప్రస్తుతం రెట్టింపు అయ్యింది. ఇక మిడిల్ రేంజ్ మద్యం ధరల విషయానికి వస్తే అప్పట్లో మ్యాన్సన్‌హౌస్, ఎంసీ తదితరాల క్వార్టర్ ధర రూ. 110-120లు. ఇప్పుడు ఆ బ్రాండ్లు లేనేలేవు. అన్నీ నాసిరకం బ్రాండులే. అయినా వాటి రేటు క్వార్టర్ రూ. 220లు. యబౌమిడిల్ రేంజ్ మద్యం విషయానికి వస్తే అప్పట్లో క్వార్టర్ రూ. 180లు అయితే ఇప్పుడు రూ. 320లు. అప్పట్లో టాప్‌రేంజ్ మద్యం క్వార్టర్ రూ.250 నుంచి 300లుగా ఉంటే ఇప్పుడు రూ. 450 నుంచి రూ.600 వరకు ఉంది. బీర్ల విషయానికి వస్తే అప్పట్లో కింగ్‌ఫిషర్, నాక్ అవుట్ తదితర ఇంటర్‌నేషనల్ బ్రాండ్ల ధర రూ. 110లు. ఇప్పుడు భూమ్ భూమ్ లాంటి వాటి (దేశంలో ఇక్కడ తప్ప మరెక్కడా దొరకని బ్రాండ్లు) ధర రూ. 220-230. అంటే చీప్ మొదలు, మిడిల్ రేంజ్ కాని, అప్పర్ రేంజ్ కాని, బీర్లు కాని ఏదైనా కాని టీడీపీ హయాంలో ఉన్న ధరకన్నా ప్రస్తుతం ధర దాదాపుగా రెట్టింపు అయింది.

● ధరల దోపిడీ రూ. 2,500 కోట్లు

గత నాలుగేళ్ల కాలంలో అధిక ధరల రూపంలో జిల్లా ప్రజలు ఎంత దోపిడీకి గురయ్యారో తెలుసుకుందాం. 2020 నుంచి 2023 వరకు విభజిత నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన అమ్మకాల విలువ అక్షరాల రూ. 5,060 కోట్లా 88 లక్షలు. గత ఏడాది రూ. 1,433 కోట్ల విక్రయాలు జరిగాయి. దానికి ముందు 1,327 కోట్లు. కరోనా కారణంగా 2020,2021 సంవత్సరాల్లో రూ.1,038, రూ.1,261 కోట్లు. కరోనా కారణంగా ఆ రెండేళ్ల మద్యం విక్రయాలు కాస్త తగ్గాయి. సరే...ఈ నాలుగేళ్ల కాలంలో రూ.5,060 కోట్ల విక్రయాలు జరిగాయి. ఇందులో 2019(టీడీపీ హయాంలో) ధరలతో పోల్చితే సుమారు రూ. 2,500 కోట్ల దోపిడీ జరిగింది. అంటే వైసీపీ ప్రభుత్వంలో గడచిన నాలుగేళ్ల కాలంలో జిల్లాకు చెందిన మద్యం ప్రియులు అధిక ధర రూపంలో నష్టపోయిన మొత్తం రూ. 2,500 కోట్లన్నమాట.

అమ్మఒడి, రైతు భరోసాల కన్నా అధికం


మద్యం అధిక ధరల రూపంలో నాలుగేళ్ల కాలంలో జిల్లా వాసులు నష్టపోయింది ఎంతంటే...? రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకునే అమ్మఒడి, రైతు బరోసా పథకాల ద్వారా ఇచ్చిన మొత్తం కన్నా 900 కోట్లు ఎక్కువగా ఉంటడం గమనార్హం. జిల్లాలో అమ్మఒడి కింద ఏటా 2లక్షల మందికి ఒక్కొక్కరికి రూ. 13వేలు చొప్పున పంపిణీ చేశారు. అంటే ఏడాదికి రూ.260 కోట్లు. నాలుగేళ్ల కాలానికి రూ.1,060 కోట్లు. రైతు భరోసా పథకంలో రాష్ట్ర వాటా రూ. 7,500లు. జిల్లాలో 2లక్షల మంది రైతులకు ఇస్తున్న మొత్తం రూ. 150 కోట్లు. నాలుగేళ్ల కాలంలో ఇచ్చిన మొత్తం రూ. 600 కోట్లు. అమ్మఒడి 1,060 కోట్లు, రైతు భరోసా రూ.600 కోట్లు కలుపుకుంటే మొత్తం రూ. 1,660 కోట్లు. కానీ ఒక్క మద్యంపై అధిక ధరల రూపంలో పిండుకున్న మొత్తం రూ.2,500 కోట్లు.



అనంతసాగరంలోని ఓ దుకాణం ముందు మద్యం కోసం బారులు తీరిన మందుబాబులు

● ప్రజారోగ్యం మాటేమిటో...?

ఆరోగ్యమే మహాభాగ్యం అనేది దేశావాసుల నినాదం. ఆరోగ్యాన్ని దేనితోనూ విలువ కట్టలేం. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన నాసిరకం మందు కారణంగా లక్షలాదిమంది కుటుంబ యజమానుల ఆరోగ్యాలు గుల్ల అయ్యాయి. నాసిరకం మద్యం కారణంగా కాలేయ సంబంధిత వ్యాధులు ఎక్కువయ్యాయి. తాజాగా బ్రెయిన్ స్ట్రోక్‌లు కూడా సంభవిస్తున్నాయి. ఇటీవలి కాలంలో 30 నుంచి 40 ఏళ్ల లోపు ఉన్న యువకుల్లో ఎక్కువమందికి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఇందుకు కారణం నాణ్యత లేని మద్యం తాగడమేనని వైద్యులు అంటున్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాలు, అనుమతి పొందిన బార్లలో తప్ప మరెక్కడా మందు దొరకదు. మరి మద్యం తాగడం వల్ల ప్రజారోగ్యాలు ఇలా గుల్లవుతున్నాయంటే అందుకు బాధ్యత ఎవరు వహించాలో ప్రజలే ఆలోచించాలి.



సర్వేపల్లిలో నేడు 'ప్రజాగళం'

● బహిరంగ సభలో పాల్గొననున్న చంద్రబాబు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 19 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శనివారం సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు పొదలకూరులోని గేట్ సెంటర్ వద్ద జరిగే ప్రజా గళం సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. ఉదయం 11 గంటలకు గూడూరులో జరిగే సభలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు పొదలకూరు చేరుకుంటారు. ఈ మేరకు టీడీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న సోమిరెడ్డి, అజీజ్, కన్నబాబు తదితరులు

పొదలకూరుకు సాగునీరందించి పునర్జన్మ ఇచ్చింది చంద్రబాబే!

- మాజీ మంత్రి సోమిరెడ్డి
- భయం వద్దు.. స్వచ్ఛందంగా ఓటెయ్యండి : అజీజ్

పొదలకూరు : మండల రైతాంగానికి సాగు నీరందించే కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్, సోమశిల దక్షిణ కాలువ పనులను పూర్తి చేసి మండలానికి పునర్జన్మనిచ్చింది మాజీ సీఎం చంద్రబాబేనని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శని వారం చంద్రబాబు రాక సందర్భంగా మర్రిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను జిల్లా నాయకులు అబ్దుల్ అజీజ్, జి.కన్నబాబు తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. అలాగే బహిరంగ సభ జరిగే గేట్ సెంటర్ కూడలి ప్రదేశాన్ని కూడా పరిశీలించి, స్థానిక నాయకులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజున పొదలకూరు మండలానికి పునర్జన్మనిచ్చిన చంద్రబాబు రావడం మండల ప్రజానీకం చేసుకున్న అదృష్టమన్నారు. మంత్రి కాకాణి సర్వేపల్లి ఏర్పడిన తర్వాత ఏ ఎమ్మెల్యే చేయని విధంగా దోపిడీ చేశారని, ఆయన దోపిడీతో ఎవరు పోటీ పడలేరన్నారు. నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అజీజ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎవరికీ భయపడనవసరం లేదని, బెదిరింపులకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు గోడల మధ్య వేసే ఓటును ఎవరూ చూడలే రని, అభివృద్ధి వైపు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొమ్మి సురేంద్ర, తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్య నాయుడు, వెంకటరత్నం నాయుడు, వెంకటరెడ్డి, దేవరం అమరనాథ్‌రెడ్డి, బిల్లు సుందరయ్య పాల్గొన్నారు.

కన్న ఊరి కోసం కాపుకాశా..
ఇప్పుడు ఒంటరినయ్యా!

- ఇస్కపల్లి తలెత్తుకునేలా అభివృద్ధి చేశా
- ఎవరిని ఓడించామో ఆ నలుగురు ఒక్కటై పోయారు!
- అందుకే మిమ్మల్ని కోరతా ఉండా!
- కష్టాల్లో ఉన్నా..! సహాయం చేయండి!.
- ఉద్వేగంతో టీడీపీ నేత బీద రవిచంద్ర కంటతడి



బీద రవిచంద్ర... చిన్న కార్యకర్తగా తెలుగుదేశం జెండా పట్టుకుని క్రమశిక్షణ, కఠోర శ్రమతో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. చంద్రబాబు, నారా లోకేష్‌లకు అత్యంత స్నేహితుడిగా మారారు. తలపండిన నెల్లూరు జిల్లా నాయకుల తలలో నాలుకలా మెదిలారు. రాయలసీమ జిల్లాల సమన్వయకర్తగా టీడీపీ అభ్యర్థుల ఖరారులో కీలకపాత్ర పోషించారు. అదరని, బెదరని, తొణకని లోతైన మనిషిగా గుర్తింపు పొందారు. అలాంటి వ్యక్తి సొంతూరిలో చంటిబిడ్డగా మారిపోయాడు. ఆప్తుల ముందు కష్టం చెప్పుకునే క్రమంలో ఉద్వేగానికి లోనై చిన్న పిల్లాడిలా కంటతడి పెట్టుకున్నారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గురువారం రాత్రి బాగా చీకటిపడ్డాక బీద రవిచంద్ర తన సొంతూరైన ఇస్కపల్లి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన అన్న మాటలు యధాతథంగా..!

'కన్న ఊరికి, కార్యకర్తలకు కష్టం రాకుండా కాపుకాశా. కన్నీరు తుడిచా. ఈ రోజు ఒంటరివాడినయ్యాను. మిమ్మల్నే నమ్ముకొని ఒంటరి పోరాటం చేస్తున్నా. ఇస్కపల్లి తలెత్తుకునేలా అభివృద్ధి చేసిన నాకు తలదించుకునే పరిస్థితి తీసుకురావద్దని అభ్యర్థిస్తున్నా..

మనం గెలిపించినోళ్లు.. మనం ఓడించినోళ్లు నలుగురు ఒకటైపోయారు. ఎవరికోసమైతే పోరాడామో, ఎవరి వల్ల అయితే ఇబ్బందులు పడ్డామో, ఎవరిని గెలిపించడానికి ఎవరిని ఓడించామో ఆ నలుగురు ఒకటైపోయారు. నేను ఒక్కడిగా మిగిలాను.

ఈ 20 ఏళ్లు నా ఇష్టాలతో పని లేకుండా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పోరాడా. మొన్న ఎన్నికల్లో విష్ణువర్ధన్ రెడ్డి కోసం పని చేశాం. దానికి ముందు బీద మస్తాన్‌రావు కోసం పని చేశాం. దానికి ముందు ఆదాల ప్రభాకరరెడ్డి కోసం పని చేశాం. ప్రతాప్‌రెడ్డిని ఎవరి కోసం ఓడించాలని అనుకున్నాం. నాకేం ప్రతాప్‌రెడ్డితో వ్యక్తిగత విరోధం లేదే! విష్ణువర్ధన్ రెడ్డిని ఎందుకోసం ఓడించాం. ఆదాల ప్రభాకరరెడ్డి కోసం, బీద మస్తాన్‌రావు కోసం ఓడించాం. ఈ 20 ఏళ్లు ఎవరిని గెలిపించామో, ఎవరిని ఓడించామో ఆ నలుగురు ఒక్కటైపోయారు. నేను ఒక్కడినే ఒంటరిగా మిగిలాను. అందుకే మిమ్మల్నందరినీ కోరతావుండా. కష్టాల్లో ఉండా..! సహాయం చేయండి!.' అంటూ బీద రవిచంద్ర ఉద్వేగానికిలోనై కళ్లనీళ్ల పర్యంతం అయ్యారు. ఆ సన్నివేశం ఇస్కపల్లిని కదిలించింది. 'మీ వెంట మేమున్నాం' అంటూ నినదింపజేసింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

లంచం సొమ్ము బాధితులకు వాపస్

కావలి రూరల్, ఏప్రిల్19: కావలి రూరల్ మండలం కొత్తపల్లికి చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల లంచం సొమ్మును తిరిగి ఇచ్చేశారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది లంచం డిమాండ్ చేసి, ఆ తర్వాతే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందచేశారు. ఈ విషయ మై ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో 'చిల్లరిస్తేనే చెక్కు లు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే ఇప్పటి వరకు గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం ఒక్కసారిగా బట్టబయలు కావటంతో ఈ విషయమై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విచారించగా, ముగ్గురు వాటాదారులని తేలింది. ఎన్నికల సమయం కావటంతో తమకు చెడ్డపేరు వస్తుందనే భావనతో గురువారం రాత్రే లంచంగా తీసుకున్న సొమ్మును గుట్టుగా తీసుకెళ్లి బాధితులకు అప్పగించారు. ఫోన్ పే ద్వారా తీసుకున్న రూ.30 వేలు తిరిగి ఫోన్‌పే ద్వారా వారికి చెల్లించారు. నగదు రూపంలో తీసుకున్న రూ.1,90,000ను తిరిగి నగదు రూపంలోనే బాధితులకు చేర్చారు. దీంతో బాధితులు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

దీనదయాళ్‌నగర్ వద్ద దారి దోపిడీ

● రూ. 9.43 లక్షల అపహరణ

నెల్లూరురూరల్, ఏప్రిల్ 19 : నెల్లూరు రూరల్ మండల పరిధి కోడూరుపాడు కల్లీకాలనీలోని దీనదయాళ్ నగర్ సమీపాన ఉన్న వెంకటప్రసాద్ రైస్‌మిల్లు వద్ద దారి దోపిడీ జరిగినట్లు గురువారం తమకు ఫిర్యాదు అందినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు, ఇందుకూరుపేట మండలం పల్లెపాడు ఇసుక రీచ్‌లో గుమస్తాలుగా పనిచేస్తున్న పెంచలప్రసాద్, బాలక్రిష్ణలు ఈనెల 17న రీచ్‌లో వచ్చిన వసూళ్లు రూ. 9.43 లక్షలను తీసుకుని వేదాయపాళెంలోని రీచ్ కార్యాలయంలో జమ చేసేందుకు స్కూటర్‌పై బయలుదేదారు. వారు దీనదయాళ్ నగర్ దగ్గరకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. కిందపడిపోయిన తమవద్దకు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై వచ్చి నగదు ఉన్న బ్యాగును అపహరించుకు వెళ్లారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ మారుతీకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెండో రోజు

8 మంది.. 17 సెట్లు

నెల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. రెండో రోజూ నామినేషన్ల జోరు కనిపించింది. పలు స్థానాలకు కీలక పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు ఎంపీతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎనిమిది అభ్యర్థులు 17 సెట్ల నామినేషన్లు వేశారు. నెల్లూరు ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు రిటర్నింగ్ అధికారి ఎం హరినారాయణన్‌కు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎటువంటి హంగు, ఆర్భాటాలు లేకుండా తన నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ నామినేషన్‌ను ఆర్వో ఏ మలోలాకు అందజేశారు. తొలి రోజే ఒక సెట్‌ను శ్రీధర్‌రెడ్డి తరఫున దాఖలు చేసిన విషయం తెలిసిందే. కావలి టీడీపీ అభ్యర్థి దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయనకు డమ్మీగా దగ్గుమాటి సంహిత కూడా రెండు సెట్లను దాఖలు చేశారు. రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులుగా కందుకూరులో బాల్‌కుమార్ ఎండ్లూరి, కావలిలో యల్లు సల్మాన్‌లు నామినేషన్లు వేశారు. ఆత్మకూరులో యుగతులసీ పార్టీ తరఫున నెల్లూరు కృష్ణారెడ్డి రెండో రోజు మరో సెట్ నామినేషన్‌ను వేశారు. నెల్లూరు రూరల్‌లో సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఫాజిల్ సయ్యద్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా నెల్లూరు సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాల్లో రెండో రోజూ కూడా నామినేషన్లు దాఖలు కాకపోవడం విశేషం.



నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



కావలిలో ఆర్వో శీనా నాయక్‌కు నామినేషన్ పత్రాలు ఇస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కోటంరెడ్డి ఆస్తులు రూ.2.45 కోట్లు

నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబం ఆస్తుల విలువ రూ.2.45 కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు. శ్రీధర్‌రెడ్డి పేరు మీద రూ.95.61 లక్షల విలువైన చరాస్తులు ఉండగా ఆయన సతీమణి పేరు మీద రూ.59.81 లక్షల చరాస్తులున్నాయి. అలానే శ్రీధర్‌రెడ్డి పేరుపై రూ.25.38 లక్షలు, ఆయన సతీమణి పేరుపై రూ.64.33 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. అలానే వీరిద్దరికి రూ.16.90 లక్షల అప్పులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక శ్రీధర్‌రెడ్డిపై నాలుగు కేసులు కూడా ఉన్నట్లు చూపించారు. నెల్లూరులోని చిన్న బజారు పోలీసు స్టేషన్ పరిధిలో సెక్షన్లు 143,341, రెడ్‌విత్149 ఐపీసీ కింద ఎఫ్ఐఆర్ నెంబర్ 216/2023 నమోదై ఉంది. అలానే దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో క్రైమ్ నంబర్ 152/2023గా కేసు నమోదు ఉంది. ప్రభుత్వ ఉద్యోగి విధులను అడ్డుకున్నందుకు ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వేదాయపాలెం పీఎస్ పరిధిలో 30/2023 ఎఫ్ఐఆర్ నంబర్‌తో మరో కేసు నమోదై ఉంది. సెక్షన్లు 448, 363, రెడ్‌విత్ 34 ఐపీసీ కింద ఈ కేసు నమోదు చేశారు. అలానే 2018లో ఏసీబీ నమోదు చేసిన బెట్టింగ్ కేసు ప్రస్తుతం విజయవాడలోని కోర్టులో విచారణ దశలో ఉండగా దానిపై అప్పీల్ హైకోర్టులో పెండింగ్ ఉన్నట్లు శ్రీధర్‌రెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా శ్రీధర్‌రెడ్డి వీఆర్ కాలేజీలో బీకాం డిస్‌కంట్యూనిడ్ అయ్యారు.

కొప్పుల రాజు ఆస్తులు రూ.11.55 కోట్లు

నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ ఐఏఎస్ అధికారి, పూర్వపు కలెక్టర్ కొప్పుల రాజు కుటుంబం ఆస్తుల విలువ రూ.11.55 కోట్లుగా ఉంది. కొప్పుల రాజుతో పాటు ఆయన సతీమణిపేర్లపై ఈ ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రాజు పేరు మీద రూ.10.44 లక్షలు, ఆయన సతీమణి పేరు మీద రూ.82.43 లక్షల చరాస్తులున్నాయి. అలానే రాజు పేరుపై రూ.5 కోట్లు, ఆయన సతీమణి పేరుపై రూ.5.62 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపారు. ఇక వీరికి రూ.1.02 కోట్ల అప్పులు కూడా ఉన్నట్లు చూపించారు. కొప్పుల రాజు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు.

అభివృద్ధి చేసి చూపిస్తా!

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు

నెల్లూరు (హరనాథపురం/ వైద్యం) : గతంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సంపూర్ణ అనుభవంతో నెల్లూరు పార్లమెంటును అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొప్పుల రాజు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్‌కు నామినేషన్ పత్రాలను ఆయన దాఖలు చేశారు. ముందుగా వీఆర్సీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్, వామపక్షాలు, ఆమ్ ఆద్మీ నేతలు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కొప్పుల రాజు మాట్లాడుతూ గతంలో తాను జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు అధిక సమయం కేటాయించి, సమస్యలు పరిష్కరించానని చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే పేదల మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తానని చెప్పారు. యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు రావాలన్నా, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, ఎంపీగా తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, ఉడత వెంకట్రావ్, పల్లంరెడ్డి యశోధర తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు

ప్రలోభాల సామగ్రిపై నిఘా ముమ్మరం చేయండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. రాత్రివేళల్లో కూడా తనిఖీలను ముమ్మరంగా చేపట్టి, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువుల రవాణాను నిరోధించాలని సూచించా రు. 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఖర్చులన్నీ అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడున్న కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరు ఉదయగిరి

రేపు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 148 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు.

మద్యం సీసాల పట్టివేత

సంగం, ఏప్రిల్ 19: స్థానిక కలిగిరి రహదారి కూడలిలోని ఓ కూల్ డ్రింక్స్ షాపుల్లో శుక్రవారం మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మల్లెకొండమ్మ అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

- నియోజకవర్గంలో 278 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం
- ఫారం-12డీ స్వీకరణ నేడే తుది గడువు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధులత

ఇంటర్వ్యూ...



రిటర్నింగ్ అధికారి మధులత

ఆత్మకూరు ఏప్రిల్ 19: నియోజకవర్గంలో 278 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రశాంతంగా ఎన్నికల జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి కె.మధులత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పట్టణ ఏఈఆర్వోగా మున్సిపల్ కమిషనర్, మండలాల్లో ఏఈఆర్వోగా తహసీల్దార్లు పనిచేస్తారన్నారు. మర్రిపాడు మండలంలో 43 పోలింగ్ కేంద్రాలు, అనంతసాగరంలో 46, ఆత్మకూరులో 64, ఏఎస్‌పేటలో 38, సంగంలో 47, చేజర్లలో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో 66 ను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. నియోజకవర్గంలో 2,14,582 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 85 ఏళ్ల వయసు మించిన వారికి, వికలాంగులకు ఇంటి వద్ద ఓటు వేసేసేందుకు ఫారం 12-డిని స్వీకరిస్తామన్నారు. సెక్టార్ ఆఫీసర్, బీఎల్‌వో ప్రతి ఇంటికి వెళ్లి దరఖాస్తులు తీసుకుంటారని చెప్పారు. అనంతరం స్క్రూటినీ నిర్వహించి అర్హులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. మే 3, 4, 5 తేదీలో మొదట విడతగా, 8, 9, 10 తేదీల్లో రెండవ విడతగా ఇంటి వద్ద ఓటు వేయ వచ్చని వివరించారు. మే 13న జరిగే శాసనసభ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్లు ఈ నెల 18 నుంచి 25వరకు స్వీకరిస్తామన్నారు. ఎస్సీఎస్టీ అభ్యర్థులు నామినేషన్ డిపాజిట్ కింద రూ.5000లు, ఇతర అభ్యర్థులు రూ.10000 డిపాజిట్ చెల్లించాలన్నారు. ప్రతి అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురు హాజరు కావచ్చన్నారు. 100 మీటర్ల దూరం అవతలే వాహనాలు నిలిపివేయాల్సి ఉందన్నారు. 26న నామినేషన్ల స్క్రూటినీ, 29న ఉపసంహరణ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటిస్తామన్నారు.

రెండోసెట్ నామినేషన్ దాఖలు

యుగ తులసి పార్టీ అభ్యర్థిగా నెల్లూరు కృష్ణారెడ్డి శుక్రవారం రెండో నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మధులతకు అందజేశారు.

రెండోరోజు నామినేషన్ల నిల్

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెండోరోజైన శుక్రవారం ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.



ఎంపికైన జిల్లా జట్టు

రాష్ట్ర బాస్కెల్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 : నూజివీడులో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర జట్టును ఎంపిక చేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదం వాసు తెలిపారు. నెల్లూరులోని వీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా జట్టును ఆయన ప్రకటించారు. ఎండీ రెహమాన్, డీ మణి, ఎస్‌కే ఖలీమెయిద్దీన్, ఎం సంతోష్, వీ లక్ష్మీనరసింహ, కే సూర్యతేజ, సీహెచ్ మదన్, కే లక్ష్మీనరసింహ, కే లక్ష్మీశ్రీనివాస్, ఎం అరుణ్‌కుమార్. వీ జాషువా ఎంపికయ్యారన్నారు. వీ చైతన్య శిక్షకుడిగా వ్యవహరిస్తారని తెలిపారు.

24 నుంచి యోగ శిక్షణ

నెల్లూరు బీవీనగర్‌లోని సంఘమిత్ర విద్యాలయం ఆవరణలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30 వరకు ఇన్నర్ ఇంజనీరింగ్ సాధన ద్వారా శాంభవి మహాముద్ర, యోగక్రియ శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు మాధవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 9440535032, 9490894152 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో 9 గొర్రెల మృతి



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

మర్రిపాడు, ఏప్రిల్ 19: స్థానిక అల్లంపాడు కాస్‌రోడ్డు వద్ద శుక్రకారం ఉదయం కారు ఢీ కొనడంతో 9గొర్రెలు మృతి చెందాయి. పల్లవోలు గ్రామానికి చెందిన కొండయ్య మేత కోసం తన గొర్రెల మందను వింజమూరు తీసుకెళ్తున్నాడు. గొర్రెలు రోడ్డు దాటేక్రమంలో మంద పైకి నెల్లూరు వైపు వెళ్తున్న కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50లక్ష నష్టం వాటిల్లిందని రైతు కొండయ్య వాపోయారు. తప్పించుకెళ్లిన కారును డీసీపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకొని మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గేదె కోసం చెరువులో దిగి యువకుడి గల్లంతు



చెరువు వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

మనుబోలు, ఏప్రిల్ 19: వీరంపల్లి చెరువులో ఇటీవల యువకుడు గల్లంతై మరణించిన సంఘటన మరువకముందే మండలంలోని వడ్లపూడి చెరువులో గేదె కోసం దిగిన ఓ యువకుడు గల్లంతైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోసూరు శంకరయ్య కుమారుడు కోసూరు కిషోర్ (27) గేదెలు కాస్తుంటాడు. రోజువారీలాగానే ఇంటి నుంచి గేదెలను తీసుకుని పొలాలు, చెరువు వైపు వెళుతుండగా ఓ గేదె చెరువులోకి దిగింది. దీంతో దానిని అదిలించేందుకు కిషోర్ చెరువులోకి దిగి లోతుకు వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ కనిపించకపోవడంతో తోటికాపరులు గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్ గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందితో వడ్లపూడి చెరువులో ఎంత గాలించినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

- రూ. 10 లక్షల ఆస్తినష్టం



కాలిబూడిదైన పూరిల్లు, సామగ్రి

మనుబోలు, ఏప్రిల్ 19: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన అనుపల్లిపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండుబోయిన అశోక్‌కు చెందిన పూరింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. అనంతరం ఇంట్లో ఉన్న సిలిండర్ పేలి మంటలు పూర్తిగా వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బీరువాలో ఉన్న రూ. 2లక్షల నగదు, 10 సవర్ల బంగారం, దుస్తులు, వంటసామాగ్రి కాలి బూడిద య్యాయని, రూ. 10లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లి నట్లు బాధితుడు విఆర్‌వో శ్రీనువాసులు ఎదుట వాపోయాడు. ప్రమాద నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వీఆర్‌వో తెలిపారు.

వైభవంగా హనుమంతుడి గ్రామోత్సవం

సంగం, ఏప్రిల్ 19: వంగల్లు కోదండరామాలయంలో గురువారం అర్ధరాత్రి హనుమంతుని గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాన్ని హనుమంతునిపై ఉంచి గజపూలమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆలయ పూజారి కిషోర్‌కుమార్ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి రమేష్‌బాబు

ఆత్మకూరు, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండి ఆస్తి, ప్రాణనష్టాలు జరుగకుండా అరికట్టాలని అగ్నిమాపక అధికారి రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాల ప్రాంగణంలో వైద్యులు, సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు, రోగులకు ఆత్మకూరు అగ్నిమాపక దళ సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు నాలుగురకాలుగా సంభవిస్తాయని విపులీకరించారు. అగ్ని ప్రమాదాలలో గాయపడిన వారిని ఎలా రక్షించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఇళ్లలో వంటగ్యాస్ ప్రమాదం, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపకదళ సిబ్బంది కె.శ్రీనివాస రావు, ఏ.సుధాకర్‌రావు, టి.రమేష్ పాల్గొన్నారు.

నేడు ఆనం సమావేశం

ఆత్మకూరు: స్థానిక రవితేజ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10గంటలకు నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తతో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మేకపాటి కోడలు ప్రచారం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 19: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోడలు నిహారికరెడ్డి పట్టణంలోని యూనియన్‌రోడ్డు, పీర్లచావిడి, సోంపల్లివారి వీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల కన్వీనర్ ఓబులరెడ్డి, అక్కి. భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి, ఎంఏ సలీం, ముర్తుజా పాల్గొన్నారు.

వీపీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చెంచలబాబు, నాయకులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 19: స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నెల్లూరు ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ మాట్లాడారు. మెట్ట ప్రాంతంలో వీపీఆర్ అమృత్‌ధార కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్న ఘనత ఆయనదే అన్నారు. ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మెట్ట ప్రాంత ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, సందానీ, ఎల్‌సీ రమణారెడ్డి, గూడూరు వెంకటేశ్వరరావు, మాబాషా, శ్రీరాములు, పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ఘనంగా వీపీఆర్ జన్మదిన వేడుకలు: నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయ కులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆయన ఎంపీగా ఘన విషయం సాధించి మెట్ట ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు శ్రీకర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, దుగ్గిరెడ్డి గురవారెడ్డి, మధు, అబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యం



దుత్తలూరు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న గిరిజన మోర్చా నాయకులు

అనంతసాగరం, ఏప్రిల్ 19: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. శుక్రవారం సంజీవనగరం, గౌరవరం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. సంజీవనగరంలో వైసీపీ నేత బోయపాటి శ్రీనివాసులునాయుడు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్బరాజు, శాఖమూరి సుబ్బారావు, చంద్రా రాజయ్య, నర్సారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామయ్యనాయుడు పాల్గొన్నారు.

సీతారామపురం: పంద్రంగి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీకాలనీలో, సింగరెడ్డిపల్లి, సీతారామపురంలో టీడీపీ నాయకులు చింతల శ్రీనివాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు ఇస్తామన్నారు. అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తామన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందుతాయని చెప్పారు. 18నుండి 59ఏళ్ల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.15వేలు వస్తాయన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్నారు. టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి 50ఏళ్ళ పైబడిన బీసీలకు రూ.4వేలు పెన్షన్ ఇస్తుందన్నారు. అలాగే వృద్ధాప్య పింఛన్ రూ.3వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారు. ప్రతినెలా 1వ తేదీన వారి ఇంటి వద్దకే పించను అందుతుందన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్ల సురేష్, పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చింతల శ్రీనువాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభకర్ రాజు, చెన్నకేశవులు, జనసేన నాయకులు బోగినేని కాశిరావు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, జనసేన మండల అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, జాషువా, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.



సీతారామపురంలో యువకులు..

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ప్రసాద్, పొట్లూరి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం నర్రవాడ వెంగమాంబకాలనీ, నాయుడుపల్లిలో నిర్వహించిన ప్రచారంలో వారు మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనలకు జరిగిన మోసాలు, అన్యాయాలను వారికి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, పొట్లూరి సురేఖ పాల్గొన్నారు.



అనంతసాగరం ప్రచారంలో నేతలు..

అన్న గెలుపు కోసం తమ్ముడు..



ఇందిరానగర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కాకర్ల సునీల్, నాయకులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 19: నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం ఆయన తమ్ముడు కాకర్ల సునీల్, మరదలు సురేఖలు శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఉదయగిరి పట్టణంలోని ఇందిరానగర్, ఎస్సీ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, సందానీ, మాబాషా పాల్గొన్నారు.

బాబాయి విజయం కోసం..



జండాదిబ్బలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న నాయకులు

సంగం, ఏప్రిల్ 19: జండాదిబ్బలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం కోసం ఆయన అన్న కుమారుడు ఆనం రంగమయూర్‌రెడ్డి శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఓటుహక్కును తప్పక వినియోగించాలి

కలువాయి, ఏప్రిల్ 19: ఉపాధ్యాయులందరూ తప్పకుండా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాయలంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలని ఎంఈవోలు బాలకృష్ణారెడ్డి, శేషగిరి కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ ఆలీ, జనార్దన్‌రెడ్డి, పద్మనాభం, వల్లూరు కృష్ణారెడ్డి, యడ్ల సురేష్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కలువాయి, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మండలంలో తిరుగుతూ అనుమానం వచ్చినచోట వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో చెకిపోస్టును ఏర్పాటు చేసి కలువాయిలోకి ప్రవేశించే వాహనాలన్నింటినీ తనిఖీ చేస్తున్నారు. అలాగే గ్రామాల్లోని వచ్చే కొత్త వ్యక్తులపై నిఘా ఉంచినట్లు మండల ఎంసీసీ అధికారి, ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న ఎంసీసీ సభ్యులు గ్రామాల్లోని కొత్తవ్యక్తులు ఎవరూ వస్తున్నారు. వారు ఏ పనిమీద ఇక్కడి వస్తున్నారో తెలుసుకుని నమోదు చేసుకుంటున్నట్లు వివరించారు.

తెలుగుదేశంలోకి భారీగా చేరికలు



ఆనం సమక్షంలో తెలుగుదేశంలో చేరిన గోనుగుంట గ్రామస్థులు

చేజర్ల, ఏప్రిల్ 19: మండలంలో వైసీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. నిన్నటి వరకు వైసీపీలో కొనసాగిన మాజీ లక్ష్మయ్య నాయుడు సోదరులతో పాటు పలువురు సీనియర్ నాయకులు గురువారం రాత్రి తెలుగుదేశంలో చేరారు. నెల్లూరులోని లక్ష్మయ్య నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో కొమ్మి సిద్దులనాయుడు, కొమ్మి రమేష్‌నాయుడు, కొమ్మి ప్రసాద్‌నాయుడు, టి.కే పాడు సర్పంచ్ కాకుమూరు మస్తానమ్మ, కోనంకి వెంకటేశ్వర్లు, కోనంకి బాబు ప్రేమ్‌కుమార్ రెడ్డి, అనం తనేని బాబుతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఐదు మూడు వందల కుటుంబాలు టీడీపీలో చేరారు. శుక్రవారం ఉదయం నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో ఆనం రామనారాయణరెడ్డి, గిరినాయు డు సమక్షంలో మండల సీనియర్ నాయకులు వావిలేరు సర్పంచ్ గోనుగుంట రాంబాబుతో పాటు మదమంచి రత్నయ్య, అనంతనేని ఎరుకులయ్య, పొత్తూరు వెంకటేశ్వర్లు, మదమంచి శ్రీనివాసులు, చిరుమామిళ్ళ పెంచలయ్యతో పాటు 50కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అన్నలూరు శ్రీనివాసుల నాయుడు, అనంతనేని బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగారు.. హామీ మరిచారా?



గుంతలతో అధ్వానంగా హసనాపురం-కలిగిరి రోడ్డు

ఏఎస్ పేట, ఏప్రిల్ 19: హసనపురం-కలిగిరి రోడ్డు గుంతలతో నిండి ఉండి అధ్వానంగా తయారైంది. ఎన్నికల కోడ్ రాకముందు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సొంత నిధులతో ఈ రోడ్డు అభివృద్ధికి చేస్తానని పూజలు చేసి పనులు ప్రారంభించారు. కానీ రోడ్డు పనులు జరుగలేదు. దశాబ్దాలు మారినా రోడ్డు పరిస్థితి అలాగే ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. కాని హసనపురం-కలిగిరి రోడ్డును పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఎండ దెబ్బకు సాయంత్రమే ప్రచారం

కలువాయి, ఏప్రిల్ 19: మండువేసవిలో జరిగే సార్వత్రిక ఎన్నికల ప్రచారం ప్రధాన పార్టీల నాయకులు సాయంత్రం 6గంటలు తరువాతే మొదలుపెడుతున్నారు. ఉదయం పొద్దుపొడిచినప్పటి ఎండ వేడికి తట్టుకోలేక జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. దీంతో నాయకులు కూడా ఎండ దెబ్బకు భయపడి సాయంత్రం కాగానే గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. రాత్రి 9గంటల వరకు ఇంటింటికి తిరిగి తమ పార్టీని గెలపించాలని కోరుతున్నారు. ఎండ దెబ్బకు ప్రచారం కూడా రోజుకు మూడు, నాలుగు గంటలకే పరిమితమైందని నాయకుల వాపోతున్నారు.

చేజర్ల: మండలకేంద్రంలో నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తరుపున శుక్రవారం బీజేపీ నాయకులు కర్నాటి అంజనేయరెడ్డి, కాల్వ బుజ్జిరెడ్డిలు మండల నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన పోవాలంటే కూటమి అభ్య ర్థులను గెలిపించుకోవాలన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడడం చేయడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి బుజ్జిరెడ్డి, కుంకుబాలయ్య, అరవగోపి, ప్రసాద్, హజరత్తయ్య పాల్గొన్నారు.



చేజర్లలో కూటమి నేతల ప్రచారం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7006
వెండి కిలో ధర	రూ. 85,600
వెండి ఒక గ్రాము	రూ. 87.60

ప్రకటన

నా క్లయింట్ అయిన షేక్ రహంతుల్లా తండ్రి ఖాశిం, ఇస్లాంపేట, వెంకటేశ్వరపురం, నెల్లూరు 5 బసువారు ఇచ్చిన వివరముల మేరకు యుదమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ కొడవలూరు మండలం, కొడవలూరు పంచాయితీ, కొడవలూరు గ్రామంలో సర్వే నెం 143/[illegible] ... రామబత్తిన మీరయ్య తండ్రి పోలయ్య అనువారి వద్ద నుండి రిజిస్టర్డు విక్రయ పత్రం తేది:09-10-2012 డాక్యుమెంటు నెం. 1864/2012 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లలో ఒకటైన రిజిస్టర్డు విక్రయ పత్రం తేది: 23-10-2010 డాక్యుమెంట్ నెం.2271/2010ను ... ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.2271/2010ను ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటును ఉపయోగించి ఎవరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధపరచవు.

M.Mushtaq Ahmed, M.D.A., B.L., Advocate, D.No.23-1-957, Mulapet, Nellore. Cell: 94414 43110

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

REAL ESTATE

» Ready to occupy 1/2 acre gated converted ekhata 15 fully furnished rooms garden 9Cr, Nandi Hills Road, Bengaluru. Ph: 9677002197

AJB -182075

WANTED

నెల్లూరులోని "కోమల విలాస్" హోటల్ నందు పని చేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన స్త్రీలు, క్యాషియర్ కావలెను. సమయం: 11.00 A M to నుంచి 4.00 PM. సం.ప్ర. సెల్: 98496 56370, 79896 85059

AJR-178073

పొలం అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కొండాపురం మండలం, ఆదిమూర్తిపురం గ్రామం లోని పొలం య.2.10½ సెంట్లు అమ్మబడును. సంప్ర॥ సెల్ నెం: 9177372555.

AJO-183734

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

బోగోలులో 'ఆరోగ్య సురక్ష'

బిట్రగుంట, ఏప్రిల్ 19: బోగోలు పంచాయతీ సచివాలయ-2 పరిధిలో కోవూరుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావలి ఏరియా వైద్యశాల డాక్టర్ మాధవి లత, వైద్యులు జీ హారిక, నిత్యప్రశాంతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా అవినీతిమయం

● టీడీపీ నేత బీద రవిచంద్ర



మాట్లాడుతున్న బీద రవిచంద్ర

కావలి, ఏప్రిల్ 19: వైసీపీ ఐదేళ్ల పాలనలో కావలి నియోజకవర్గంలో అంతా అవినీతి తప్ప అభివృద్ధి జాడే లేదని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. పట్టణంలోని ముసునూరులో ఉన్న టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో, అనంతరం ఆర్డీవో కార్యాలయం వెలుపుల టీడీపీ నామినేషన్ల అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి కావలిలో రెండు పర్యాయాలు, నెల్లూరు పార్లమెంట్‌లో మూడు పర్యాయాలు అవకాశం ఇచ్చారని, వారి పాలలో అరాచకాలు తప్ప సంక్షేమాలే లేవన్నారు. కనీసం స్వేచ్ఛగా మాట్లాడే హక్కు లేదని, ఎవరికీ రక్షణలేని ఈ వైసీపీ పాలన ఇంకా అవసరమా అన్నారు. ఈ పర్యాయం కావలి అసెంబ్లీకి, నెల్లూరు పార్లమెంట్‌కు టీడీపీకి అవకాశం ఇచ్చి కావ్య క్రిష్ణారెడ్డిని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే కావలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలను చూస్తే టీడీపీ పాలనలో తప్ప ఇతరుల పాలనలో కావలిలో ఎలాంటి అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి, కేంద్రంలో మోదీ ప్రధాని ఖావడం ఖాయమన్నారు. మన ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని టీడీపీకి ఇక్కడ ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతిపరుడైన ప్రతాప్‌కుమార్ రెడ్డి ఇంకా అవసరమా అన్నారు. ఈ ఎన్నికలలో వైసీపీని తరిమి కొట్టి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.4 లక్షల స్వాధీనం

కావలి రూరల్, ఏప్రిల్ 19: కావలి పట్టణంలోని పెండెం సెంటర్ వద్ద శుక్రవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4 లక్షలను సీజ్ చిసినట్లు 1వ పట్టణ సీఐ రాజేష్ తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు అక్రమ మద్యం, నగదు తరలింపుపై పోలీసులు నిఘా ఉంచారు. మండలంలోని నారాయణపురంకు చెందిన డేగా చిన్నయ్య సంచితో నడిచి వెళ్తుండటంతో పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద రూ.4లక్షలు ఉండగా అందుకు సబంధించి ఎలాంటి ఆధారాలు, ఎలక్షన్ నిర్వహణ అధికారి అనుమతులు లేవు. దీంతో నిబంధనల మేరకు అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న రూ.4లక్షలు స్వాధీనం చేసుకుని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అప్పగించినట్లు సీఐ రాజేష్ తెలిపారు.

టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి నామినేషన్ దాఖలు

కావలి, ఏప్రిల్ 19: కావలి టీడీపీ అభ్యర్థిగా దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు మూడు సెట్ల నామినేషన్ల పత్రాలు అందజేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, మైనార్టీసెల్ అధ్యక్షుడు అబ్దుల్ రహీంలతో కలిసి వారు నామినేషన్ల పత్రాలు అందజేశారు. అలాగే టీడీపీ తరుపున క్రిష్ణారెడ్డి కుమార్తె దగుమాటి సంహితారెడ్డి పేరుతో ఒక సెట్టు నామినేషన్ పత్రాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌లు అందజేశారు. తొలుత ముసునూరులోని క్రిష్ణారెడ్డి ఇంటివద్ద సర్వమత ప్రార్థనలు చేసి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తల సమక్షంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అక్కడ నుంచి నిరాడంబరంగా ఎన్డీఏ కూటమి క్యాడర్‌తో ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు.

● **రెండో రోజు ముగ్గురు నామినేషన్లు**

కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండవ రోజు శుక్రవారం ముగ్గురు నేతలు 6 సెట్ల నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందజేశారు. టీడీపీ తరుపున దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మూడు సెట్లు, ఆయన కుమార్తె దగుమాటి సంహితారెడ్డి పేరుతో ఒక సెట్టు , రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున ఎల్లు సాల్మన్ రెండు సెట్లు నామినేషన్లు అందజేశారు.

వీపీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

అల్లూరు, ఏప్రిల్ 19 : టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను అల్లూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మండలంలోని ఇందుపూరులో కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎ.చందన్‌రెడ్డిలతో కసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో బండి అమర్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, రఫీమాలిక్, బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నలగట్ల శ్రీనివాసులు రెడ్డి, కత్తుల శ్రీకాంత్, కావలి కృష్ణ, అంబటి రాజేంద్ర, ఎందోటి హరికృష్ణ, ఊటు గోపి, నలగట్ల శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుపోవాలి

కలిగిరి, ఏప్రిల్ 19 : టీడీపీ విజయం కోసం అందరినీ కలుపుకుని పోవాలని మాజీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎంవీ.రామిరెడ్డి వర్గీయులు పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగ్రామం అనంతపురంలో ఆత్మీయులతో నిర్వహించిన సమావేశంలో రామిరెడ్డి ఆట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్ల సురేష్ కోసం పనిచేస్తున్నా తమ స్వగ్రామమైన అనంతపురంలో పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు కనీసం తమకు సమాచారం ఇవ్వకపోవడం అవమానకరంగా భావిస్తున్నామన్నారు. కాగా తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని, సీనియర్లకు గుర్తింపు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్ ఫోన్ ద్వారా తెలపడంతో అంతా శాంతించారు. ఈ కార్యక్రమంలో మెట్టుకూరు రాంజీవ్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, సిద్దుల నాయుడు, కొండపనాయుడు, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటింగ్‌కు అర్హుల వివరాల సేకరణ



ఓటర్ల వివరాలు సేకరిస్తున్న సెక్టోరల్ అధికారి

అల్లూరు, ఏప్రిల్ 19 : పోలింగ్ బూత్‌కు రాలేని దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని సెక్టోరల్ అధికారి భాస్కర్ అన్నారు. అందులో భాగంగా అల్లూరు పట్టణ పరిధిలోని దివ్యాంగులు, వృద్ధుల వివరాలను ఆయన శుక్రవారం సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఓలింగ్ బూత్‌కు రాలేని ఓటరుల వివరాలను సేకరించి జిల్లా రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్నామని, తద్వారా ప్రత్యేక బృందం ఇటువంటి ఓటర్లు వద్దకు వచ్చి ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రహంతుల్లా, సచివాలయ సిబ్బంది మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలకు సురక్షిత తాగునీరు అందించాలన్న సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వంలో రూ.28 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి పథకాన్ని ఏడాది కాలంగా మూత వేసింది. దీంతో వందల గ్రామాలకు రక్షిత శుద్ధి జలాలు అందక అధిక ధరలకు తాగు నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్లను నిరుపయోగంగా మూలకు చేర్చడంతో అవి తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుతోన్నాయి.

- జలదంకి



గట్టుపల్లిలో మూతేసిన వైఎస్ఆర్ సుజల పథకం మదర్‌ప్లాంటు



జలదంకిలో మూతపడిన శుద్ధి జలాల ట్యాంకు

వైఎస్ఆర్ సుజలధార ఏడాదిగా మూత!

- టీడీపీ ప్రభుత్వంలో 8 మండలాల కోసం రూ.28 కోట్లు ఖర్చు
- నిర్వహణ భారమంటూ చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం
- వందల గ్రామాలకు ఆగిన శుద్ధి జలాల సరఫరా
- నిరుపయోగంగా మూలనపడ్డ వాటర్ ట్యాంకర్లు
- అధిక ధరకు మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్న పల్లె వాసులు
- నాణ్యమైన తాగునీరు అందక రోగాల బారిన మెట్టప్రాంత ప్రజలు
- ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు అందని సురక్షిత నీరు

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్న సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద ఒక్కో మండలానికి రూ.3.5 కోట్లు వంతున రూ.28 కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో నియోజకవర్గంలోని 8మండలాలలో శుద్ధిజల ప్లాంట్లు నిర్మింపజేశారు. ఈ ప్లాంట్లకు నీటిని సరఫరా చేసేందుకు జలదంకి మండలం గట్టుపల్లిలో మదర్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు నుంచి గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేసి ప్రజలకు రూ.2లకు 20 లీటర్లు అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకానికి పేరు మార్చి వైఎస్ఆర్ సుజలధారగా మార్చిందే తప్ప నిర్వహణ బాధ్యతను గాలికొది లేసింది. మదర్ ప్లాంటుకు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మొండి బకాయి కింద ట్రాన్స్‌కో అధికారులు సరఫరా నిలిపివేశారు. దీంతో ఏడాదిగా మెయింటెనెన్స్ చేయలేక నిర్వాహకులు మదర్‌ప్లాంటుకు తాళం వేశారు. దీంతో జలదంకి మండలంలోని 30కి పైగా గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని 7 మండలాలకు తాగునీరందించే బృహత్తర పథకానికి తాళం పడింది. ఈ క్రమంలో మండలంలోని ప్రతిపక్ష టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించి పథకాన్ని కొనసాగించి మండల ప్రజలకు తాగు నీరు అందించాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో కోట్లరూపాయల ప్రభుత్వ నిధులు వథా అయ్యాయి. ఉదయగిరి నియోజకవర్గం జిల్లాలోనే అత్యంత మెట్టప్రాంతం కావడం, వర్షాలు తక్కువగా పడి



నిరుపయోగంగా గ్రామాలకు రక్షితనీరు తరలించే ట్రాక్టర్లు

భూగర్భ జలమట్టం కూడా వేసవిలో పడిపోయి ప్రజలు తాగునీటికి కిలోమీటర్లు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. అలాంటి మెట్ట ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఎంతో కష్టపడి నియోజకవర్గం ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించినా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ ప్రాజె క్టును కొనసాగించడంలో చూపలేదు. ఎన్టీఆర్ సుజలస్రవంతిగా ఉన్నప్పుడు రూ.2లకు 20 లీటర్లు ఇచ్చేవారు. వైఎస్ఆర్ సుజలధారగా పేరు మారాకా మంచినీటి ధరను కూడా రూ.4లకు పెంచారు. అది కూడా నిర్వహణ బాధ్యతను గాలికొదిలేసి సురక్షి నీరు లేకుండా చేశారన్న ఆరోపణలు న్నాయి. ఈ క్రమంలో గత ఏడాదిగా ప్రజలు రూ.10 నుంచి రూ.20లకు 20 లీటర్లు తాగునీరు ప్రైవేటు మినరల్‌వాటర్ ప్లాంటుల నుంచి కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. కానీ ఇవి సురక్షితం కావని, వీటి వల్ల జబ్బుల బారిన పడుతున్నామని మెట్టప్రాంతం ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కొండాపురం మండలంలో ఫ్లోరైడ్ సమస్య ఎప్పటి నుంచో పట్టిపీడిస్తోంది. ప్రస్తుతం ఈ సమస్య మరింత తీవ్రమైంది. మూతపడ్డ సుజల పథకం నియోజకవర్గంలోని 8మండలాలలో కొనసాగించాలని పలు దఫాలు వైసీపీ నాయకులను, అధికారులను ప్రజలు వేడుకున్నా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ పాలనపై గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు మూతపడ్డ సుజలధార పథకాన్ని తెరిపించలేక పోయారని మెట్టప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏ ముఖం పెట్టుకుని మా ఇళ్లకు ఓట్లడగడానికి వస్తారని పేదప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్లాంటు ఆగడం మూలంగా నెలనెలా మాజేబులకు చిల్లులు పడడమే కాక సురక్షితమైన నీరు తాగలేక రోగాల బారిన పడుతున్నామని, ఇదేం ఖర్మ మాకు అంటూ ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి రేపు రాత పరీక్ష

లింగసముద్రం, ఏప్రిల్ 19 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 21వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్లు స్కూల్ వద్దనే అందజేస్తామని పేర్కొన్నారు. పరీక్షలో మార్కులు, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వారి సొంత ఖర్చులపై కందుకూరు ఆర్టీసీ డిపో వారి సహకారంతో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్, ఏప్రిల్ 19 : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో జీ.రామసిద్ధార్థ సూచించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాల, కందుకూరి హాస్పిటల్ సిబ్బందికి, రోగులకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామస్వామి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌పై వెళ్లి నామినేషన్

అల్లూరు, ఏప్రిల్ 19 : రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ రిస్ట్ కావలి అభ్యర్థిగా ఎల్లు సాల్మన్‌రాజు శుక్రవారం కావలి డివిజన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు. అల్లూరు పాత బస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై కావలికి తరలి వెళ్లారు. అక్కడ ఆర్వో శీనానాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, ముసలి నరేంద్ర, గోళ్ల మహేష్, నక్కా గిరి, కప్పల నవీన్ కుమార్, ఎల్లు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు



కందుకూరు : టీడీపీలో చేరిన దామచర్లతో ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 19: కందుకూరు పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన దామచర్ల నరసింగరావు (పండు) వైసీపీని వీడి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన వెంట పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, గల్లా రాధాకృష్ణ, కాకుమాని మాల్యాద్రి, పిరతల బాలాజీ, కాటా కిషోర్ పాల్గొన్నారు. అనంతరం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దివివారి పాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అటు రాష్ట్రంలో ఇటు కందుకూరులో టీడీపీ విజయం ఖాయమని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని పెద్దబజారు, 16వ వార్డు పరిధిలోని సోమేశ్వరాలయం ఎదురుబజారు, వినాయకుడి గుడి ప్రాంతాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీనివాసులు, జొన్నాదుల రాఘవయ్య, సీహెచ్ పాండు రంగయ్య, దండే శ్రీనివాసరావు, కొత్తూరి శివ, కోట కిషోర్, పబ్బిశెట్టి రాజా, తాతా లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లెపాలెంలో వైసీపీ కుటుంబాల చేరిక

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెంకు చెందిన పలు వైసీపీ కుటుంబాలు పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వారికి పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుబ్రహ్మణ్యం, గొల్లపోతు గోపి, శ్రీను, వెంకట కృష్ణారావు, అశోక్, ఈశ్వర్, నాగేశ్వరరావు, ఏడుకొండలు, తదితరులు ఉన్నారు. గ్రామ నాయకులు కొప్పాడి స్వాములు, నాయుడు రాజు, నాంచార్లు తదితరలు పాల్గొన్నారు.

ప్రతి మహిళకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు

లింగసముద్రం, ఏప్రిల్ 19 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ప్రతి మహిళకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తారని తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం లింగసముద్రంలోని డాక్టర్ కృష్ణమోహన్ వైద్యశాల నుంచి స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి వరకు టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, మాజీ ఎంపీపీ పి బాలకోటయ్య, ఎ నర్సయ్య, జి బాలనారాయణ, జంపాల కృష్ణయ్య, సీహెచ్ బాలకోటయ్య, ఎ చినసత్యం, జె శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జగన్ దోపిడీని అరికట్టాలి

ఉలవపాడు : అన్ని రంగాల్లో అధిక ధరలు పెంచి రాష్ట్ర ప్రజలను నిలువు దోపిడీ చేసిన జగన్ మోహన్‌రెడ్డిని ఓడించి టీడీపీని గెలిపించాలని టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ఉలవపాడులోని వడ్డెరపాలెం కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ 5 ఏళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన దోపిడీని ప్రతి గృహిణి గుర్తుకు తెచ్చుకోవాలని, చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రంలో ప్రతి కుంటుంబం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



లింగసముద్రం : ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

ఇంటింటా ప్రచారం

కొండాపురం : మండలంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం టీడీపీ నాయకులు ముమ్మరంగా ఇంటింటా ప్రచారం చేపట్టారు. గరిమెనపెంట పంచాయతీలో శుక్రవారం యాదవ కృష్ణయ్య, అల్లిక మధు, కేవీఆర్ కాలనీలో దగడ మాలకొండారెడ్డి, ఇసుకదామెర్ల గ్రామంలో బూత్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో, పార్లపల్లిలో బూత్ కనీన్వినర్ కొమ్మి కొండలరావు ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ పరిశీలకుడు కామయపల్లి సుబ్బారావు, టీడీపీ నాయకులు సి.హెచ్.వెంకటాద్రి, పోలినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దగదర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న మాలేపాటి రవీంద్రనాయుడు

పేదరిక నిర్మూలనే టీడీపీ లక్ష్యం

దగదర్తి(బిట్రగుంట) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా యువతకు ఉపాధి కల్పించేలా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టారని ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు అన్నారు. దగదర్తి మండలం చెన్నూరు పంచాయతీ కట్టుబడి పాలెం ఎస్టీకాలనీలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ వస్తేనే విమానాశ్రయం వస్తుందని, తద్వారా దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాల యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపిచుకోవాలని తెలిపారు. కాగా దగదర్తి మండలం ఎస్టీఆర్ కాలనీకి చెందిన ఇర్ల దుర్గారావు కుమార్తె శ్రీలక్ష్మి కావలి ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతుండగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ఆమెను పరామర్శించారు.

నార్తుమోపూరులో...

అల్లూరు : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంటింటా ప్రచారం జోరందుకుంది. అల్లూరు మండలం నార్తుమోపూరులో టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. నెల్లూరు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించి నార్తుమోపూరు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విడవలూరు దశరథరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కందుకూరు, ఏప్రిల్ 19: పట్టణంలోని అంకమ్మ దేవాలయం వద్ద శుక్రవారం సాయంత్రం మోటారు సైకిల్ ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. రోడ్డు దాటుతున్న వృద్ధుడిని మోటారు సైకిల్ ఢీకొట్టడంతో కిందపడి తలకు బలమైన గాయం అయింది. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనం తరం ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అయితే ఆ వృద్ధుడు ఎవరనేది నిర్ధారణ కాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో మార్చురీకి తరలించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఇంటూరి'కి మద్దతివ్వను : దివి

కందుకూరు, ఏప్రిల్ 19 : టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు రాబోయే ఎన్నికల్లో మద్దతు ఇచ్చేది లేదని కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఇదివరకే పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేస్తే పార్టీ కోసం పని చేస్తానని తెలిపారు. లేనిపక్షంలో ఇంటూరి రాజేష్‌కు మద్దతు ఇచ్చి పనిచేస్తానన్నారు. ఈ సమావేశంలో దివి సౌభాగ్య, దివి రమేష్ పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నెల్లూరు(హరనాథపురం) : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యయపరిశీలకుడు ప్రసాద్ దత్తాత్రేయ సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆర్‌వోలు, నోడల్ అధికారులతో సమావేశం జరిగింది.

అధ్వానంగా రాళ్లపాడు ఎడమ కాలువ!

● పెరిగిన జమ్ము, చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు



పిచ్చి మొక్కలతో రాళ్లపాడు ఎడమ కాలువ


లింగసముద్రం, ఏప్రిల్ 19 : రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ అధ్వానంగా ఉంది. గత రబీ సీజన్‌లో ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు లేకపోవడంతో రైతులు వరి పైరు సాగు చేయలేదు. దీంతో అధికారులు కుడి, ఎడమ కాలువలకు నీరు విడుదల చేయలేదు. నీరు విడుదల చేయని కారణంగా ఎడమ కాలువలో జమ్ము, చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు విరివిగా పెరిగాయి. అయితే ఎడమ కాలువ పరిధిలో రైతులు కొంత మేరకు వరి పైరు సాగు చేశారు. అయితే రైతులు ఈ వరి పైరును ఎక్కువగా బోర్ల కింద సాగు చేశారు. అయితే కొంత లీకేజీ ద్వారా కూడా నీరు ఎడమ కాలువకు వచ్చేది. కానీ ఎడమ కాలువ పిచ్చి మొక్కలతో నిండి ఉన్న కారణంగా ఆ వచ్చే లీకేజీ నీరు కూడా సరిగా వచ్చేది కాదు. దీంతో రైతులు ఎలాగోలా వరి పైరు పండించుకున్నారు. ఈ కాలువలో నిండి ఉన్న జమ్ము, పిచ్చి మొక్కలను వచ్చే సీజన్‌కైనా తొలగించాలని రైతులు కోరుతున్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జన కేతనం
ఆంధ్రజ్యోతి

ఓ ప్రణాళిక... పద్ధతి లేకుండా ప్రజాప్రతినిధులు ఆదేశించడం... అధికారులు తలఊపడం తప్ప.. చేస్తున్న పని సరైనదా.. కాదా.. ? అన్నది కూడా చూసుకునే పరిస్థితి ఇరిగేషన్ శాఖలో లేకుండా పోయింది. నెల్లూరు నగరంలో పెన్నా రక్షణ గోడల నిర్మాణాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.




అసంపూర్తిగా పెన్నా రక్షణగోడ పనులు



వరదొస్తే 'రక్షణ' లేదు!

జగన్ హామీకి దిక్కు

- 20 నెలలుగా అతీగతీ లేదు
- ఐదోవంతు కూడా పూర్తికాని వైనం
- 2కి.మీ. నుంచి 650 మీటర్లకు తగ్గిన పెన్నా వాల్స్
- ఎస్టిమేషన్లు, రివైజ్ ఎస్టిమేషన్లతోనే సరి
- నిర్మాణం పూర్తికి మరో రూ.150 కోట్లు అవసరం
- జగనన్నా.. మీ హామీ ఏమైందన్నా?



నెల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వస్తుందంటే నెల్లూరులోని వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీలు వణికిపోతున్నాయి. 2020, 2021 సంవత్సరాల్లో వరదలు రావడంతో ఈ ప్రాంతవాసులు కుదేలయ్యారు. కాగా 2021 డిసెంబరులో అక్కడ పర్యటించిన సీఎం వైఎస్ జగన్ రూ.వంద కోట్లతో పెన్నా రక్షణ గోడలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎనిమిది నెలలకు శంకుస్థాపన సందర్భంగా జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, నగర ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌లు.. ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కానీ రెండేళ్ల గడిచినా నేటికీ పునాదుల దశ దాటలేదు. ఆది నుంచి డిజైన్లను మార్చడం, ఎస్టిమేషన్లను రివైజ్ చేయడం తోనే కాలం గడిచిపోతోంది. కానీ చివరకు తేల్చిందేమిటంటే రక్షణ గోడలు పూర్తిగా నిర్మించేందుకు మరో రూ.150 కోట్ల వరకు అవసరమవుతాయని నిర్ధారించారు. ఇప్పుడు పెరిగిన అంచనాల మేరకు కొత్తగా మళ్లీ అనుమతులు వచ్చి పనులు పూర్తి చేయడం సాధ్యమేనా.. అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తే పూర్తవడానికి మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది.

● రాజకీయ జోక్యంతో..

2021 నవంబరులో వరదల సమయంలో రూ.80.56 కోట్ల అంచనాతో పొర్లుకట్టల నిర్మాణాలకు టీపీజీ అధికారులు టెండర్లు పిలిచారు. డిసెంబరులో టెండర్లు ముగిశాయి. అయితే ఈ పనిని దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా ఇద్దరు డిస్‌క్వాలిఫై అయ్యారు. మిగిలిన ఇద్దరు రివర్స్ టెండరింగ్‌లో నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీ పడడంతో చివరకు 13.38 శాతం లెస్‌కు(రూ.69.78 కోట్లు) శ్రీసాయి కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పనులు దక్కించుకుంది. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సూచించిన వారికి పని దక్కకపోవడంతో ఈ వర్కును రద్దు చేస్తారంటూ అప్పట్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అనుకున్నట్లుగానే అగ్రిమెంటు జరగాల్సిన సమయంలో మట్టికట్టల స్థానంలో కాంక్రీటు గోడలు నిర్మించాలన్న ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాక ఎస్టిమేషన్లు తయారు చేసిన ఇరిగేషన్ అధికారులకు ఈ విషయం ముందుగా తెలియదా.. ?అన్నదే అసలు ప్రశ్న. ఇక ఆ తర్వాత రూ.81.85 కోట్లకు అంచనాలు సవరించి 2022 ఏప్రిల్‌లో మరోమారు టెండర్లు పిలిచారు. ఈ దఫా కేవలం రెండు సంస్థలు మాత్రమే టెండర్లలో పాల్గొన్నాయి. మొదటిసారి మాదిరిగా ఇక్కడ కూడా పోటీ జరగలేదు. దీంతో 3.55 శాతం ఎక్సెస్‌తో రూ.84.76 కోట్లకు బెకెమ్-సిరి జాయింట్ వెంచర్ సంస్థ పనులు దక్కించుకుంది.

● పెరిగిన అంచనా

పోనీ ఈదఫా అయినా పనులు మొదలయ్యాయా అంటే అదీ లేదు. తీరిగ్గా పది నెలల తర్వాత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి పదిశాతం పనులు చేశారు. అయితే ప్రస్తుత డిజైన్ ప్రకారం కాంక్రీట్ వాల్ నిర్మిస్తే అది భారీ వరదలను తట్టుకోలేదని గుర్తించారు. దీంతో మళ్లీ డిజైన్ మార్పు అంటూ హడావిడి చేయడంతో పనులకు మళ్లీ బ్రేక్ పడింది. కొత్త డిజైన్లను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా కొన్ని నెలల తర్వాత ఇటీవల అప్రూవల్ వచ్చింది. అయితే కాంట్రాక్టర్ అగ్రిమెంట్ జరిగిన రూ.84.76 కోట్లకు అనుగుణంగానే కొత్త డిజైన్‌కు అనుమతులిచ్చారు. దీంతో వెంకటేశ్వరపురం నుంచి జాతీయ రహదారి దిగువున వరకు రెండు కిలో మీటర్ల మేర రక్షణ గోడ నిర్మించాల్సి ఉండగా అది 650 మీటర్లకు తగ్గిపోయింది. ఈ క్రమంలో పెన్నాకు మళ్లీ భారీ వరదలు వస్తే ఇళ్ల మధ్యలోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త ఎస్టిమేషన్లు పంపాలి..

పెన్నా రక్షణ గోడల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే కొంత జాప్యం జరుగుతున్న మాటవాస్తవమే. రివైజ్ ఎస్టిమేషన్లు అప్రూవయ్యాయి. పనుల్లో వేగం పెంచుతాం. మిగిలిన దూరాన్ని రెండో విడతలో చేపట్టేలా కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాలి.

- వై పెంచలయ్య, ఇరిగేషన్ డీఈఈ



అన్నీ మంచి రోజులే !

- అభ్యర్థుల నామనక్షత్రాలను బట్టి ముహూర్తాల బేరీజు



సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. ఈనెల 25వతేదీ నామినేషన్ల దాఖలుకు తుదిగడువు. మంచి ముహూర్తంలో నామినేషన్ వేస్తే సగం విజయం సాధించనట్లేనని అభ్యర్థుల విశ్వాసం. జన్మనక్షత్రం, నామనక్షత్రాలను గణించి జ్యోతిషులు నామినేషన్లు వేసే ముహూర్తాలు నిర్ణయిస్తున్నారు. జిల్లాలో ఒక ఎంపీ, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తొలిరోజు కొందరు నామినేషన్లు వేశారు. రెండోరోజు శుక్రవారం మరికొందరు వేశారు. అయితే చైత్రమాసంలో ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు పరిశీలిస్తే అన్నీ మంచి ముహూర్తాలే ఉన్నాయి. ఈనెల 21వతేదీ ఉన్న మంచిరోజుల్లో శ్రేష్ఠమైన రోజని వేద పండితులు తెలిపారు. ఆ రోజున ఎక్కువమంది నామినేషన్లు వేసే అవకాశం ఉందని విశ్లేకులు భావిస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

చెల్లుబాటు అయ్యే అఫిడవిట్ సమర్పించాలి: రిజిస్ట్రార్

నెల్లూరు(హరనాథపురం): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు. అఫిడవిట్ తీసుకునేటప్పుడు ఆ నోటరీ పోర్సులో ఉన్నాడా... రెన్యువల్ చేసుకున్నాడా...అనే విషయాలు పరిశీలించాలన్నారు. రెన్యువల్ చేయించుకోని నోటరీల వద్ద అఫిడవిట్ తీసుకొంటే అది చెల్లదన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థుల గమనించాలన్నారు.

వడలు మీకు.. ఓట్లు మాకు!



ప్రచార చిత్రం

నెల్లూరు నగరంలో పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి, ఆయన కుమార్తెలు సింధూర, శరణి కొంత కాలంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జనార్ధన్‌రెడ్డి కాలనీలో ప్రచారం చేస్తూ అక్కడున్న టిఫిన్ అంగడిలో వడలు కాల్చుతూ కనిపించారు రమాదేవి. ప్రచారంలో ప్రజలు చేసే వివిధ పనుల్లో వారు నిమగ్నమవుతూ ఓట్లు అడుగుతున్నారు.



పరదాల సరదా

పరదాల సరదాలకు ప్రభుత్వ అధికారులు ముగ్ధులవుతున్నట్లుంది. ఇందుకు కోవూరు ఎన్నికల కార్యాలయ ఆవరణం ఓ ఉదాహరణ. సార్వత్రిక ఎన్నికల నామి నేషన్ల దాఖలు సమయంలో ప్రతిసారీ కార్యాలయ ఆవరణలోకి ప్రధాన ద్వారం మాత్రమే లోపలికి వెళ్ళేందుకు గోడల మీద కంచె ఏర్పాటు చేస్తారు. నామి నేషన్ దాఖలు సమయంలో ఎంపిక చేసిన వా,ఇ.న లోపలికి అనుమతిస్తారు. ఇందుకోసం తహసీల్దారు కార్యాలయ ఆవరణ గోడదూకి ఎవరూ లోపలకు రాకుండా పకడ్బందీగా ఇనుప కమ్ములతో బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల కార్యాలయానికి 100 మీటర్ల దూరం నుంచి రోడ్డుపై మూకమ్మడి జనసంచారం లేకుండా నిషేధాజ్ఞలు విధిస్తారు. కాగా ఈ దఫా విచిత్రంగా గోడపై ఏకంగా 20 అడుగుల ఎత్తుకు పరదాలు కట్టేసి అధికారులు తమ సరదా తీర్చుకున్నారు. ఏకంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణను పరదాలతో కప్పేయడంతో పలు వ్యంగ్య పలుకులు వినిపిస్తున్నాయి.

- కోవూరు

కలుగోళ్ల శాంభవిని దర్శిస్తే కలుగును జయం !

సెంటిమెంట్



ఏ ఎన్నికల్లోనైనా పోటీచేసే నేతలు తొలుత కావలిలోని కలుగోళ్ల శాంభవి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తే విజయం చేకూరినట్లేననే నమ్మకం ఉంది. ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు చేపట్టాలన్నా ముందుగా అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాతే నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ప్రచారం ప్రారంభించేవారు కూడా మొదటగా అమ్మవారిని దర్శించుకునే వెళతారు. ఈ నమ్మకం ఎక్కువమంది నేతల్లో నేటికీ ఉంది. చాలామంది నాయకులు ఇప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. మరి ఈ ఎన్నికల్లో అమ్మవారు ఎవరిని కరుణిస్తారో... విజయలక్ష్మి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే!

- కావలి

లక్షలు కావాలా నాయనా!?

ద్వితీయ శ్రేణి నాయకులకు బంపర్ ఆఫర్



అవును.. ద్వితీయ శ్రేణి నాయకుల కాలమిది. ఎన్నికల్లో గెలుపే పరమావధిగా అన్ని రాజకీయ పార్టీలు కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ద్వితీయశ్రేణి నాయకులకు, కార్యకర్తలకు బాగా డిమాండ్ పెరిగింది. వారి స్థాయి, హోదాను బట్టి రూ. 5 లక్షల నుంచి 50 లక్షల వరకు ప్యాకేజీ కింద ముట్టచెబుతున్నారు. ఇటీవల జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గంలో కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రూ.20, రూ.50. రూ.10 లక్షలు చొప్పున ప్యాకేజీ ముట్టడంతో వారంతా పార్టీలు మారినట్లు పొలిటికల్ గాసిప్స్ హల్‌చల్ చేస్తున్నాయి. ఒక ప్రజాప్రతినిధికి అయితే ఏకంగా ఓ కారును కూడా కొనిస్తామంటూ హామీ ఇచ్చినట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తల తమ వంతు ఎప్పుడు వస్తుందా!? అని కళ్లలో ఒత్తులో వేసుకుని ఎదురు చేస్తున్నారు. తదానుగుణంగా గల్లీ లీడర్లు, కార్యకర్తలు సైతం తమ మాటేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ప్యాకేజీలు ఇవ్వకుంటే మరో పార్టీలో చేరిపోతామని బెదిరింపులకు దిగుతున్నారనే వార్తలూ గుప్పుమంటున్నాయి.

- ఆత్మకూరు

నీ ఓటుందో లేదో చూస్కో మావోయ్!



అల్లుడు : ఓయ్... మావోయ్.. బాగున్నావా!?

మామ : ఆ.. బాగున్నా అల్లుడూ. ఊరి నుంచి ఎప్పుడొచ్చావ్. అమ్మాయి, పిల్లలు ఎలా ఉన్నారా? ఎన్నికలొచ్చాయి అంటున్నారు. ఎప్పుడు ఓటేసేది?

అల్లుడు : అదేంది మావా!? నీకు తెల్వదా!? అసలు మనూరు పోలింగ్ బూత్‌లో నీ ఓటు ఉందో.. లేదో చూసుకో. ఎందుకంటే లిస్టులో సుబ్బాగాడు, రామయ్య పేర్లు లేదాంటా ఉండారు!? కాబట్టి ఇప్పుడే చేసుకో!

మామ : ఎందిలే అల్లుడూ.. నా ఓటు ఉంటే ఉంటదీ లేకుంటే లేదు. నేను ఓటు ఏసినంత మాత్రాన ఏం ఒరుగుతుందిలే!?

అల్లుడు : అదేంది మామా. అంత మాటంటివి. ఓటనేది మనహక్కు. మనూరు బాగుపడాలన్నా!? మన బిడ్డల భవిష్యత్తు కోసం మంచి నాయకుడ్ని ఎన్నుకోవాలా! అందుకే మనం ఓటెయ్యాలి. రేపు పోలింగ్ బూత్‌కెళ్లి నీకు ఓటుందో లేదో చూస్కో!

మామ : సరేనయ్యా.. రేపే పోయి అధికారులను అడుగుతా!?

అల్లుడు : మంచిది మామ. ఇంకో విషయం ఈసారి ఓటుకు రెండు మూడు వేలు ఇస్తారని చెబుతా ఉన్నారు. ఆశపడి ఎవరికంటే వారికి ఓటు వేయొద్దు మామో. మన రాష్ట్రం, మనూరును ఎవరూ అభివృద్ధి చేస్తారో ఆలోచించి ఓటేయాలి. గుర్తుంచుకో!?

మామ : సరేలే అల్లుడూ లోకంలో ఏం జరుగుతుందో గమనిస్తున్నాలే. సరేయిన నాయకుడుకే నా ఓటు వేస్తా.

అల్లుడు : సరే మావా ఆరోగ్యం జాగ్రత్త!. అదుగో బస్ వస్తాంది. నే బయల్దేరుతా!

- అనంత సాగరం

ఓటుకు నోటు.. ప్రజాస్వామ్యానికి చేటు !

ఎన్నికలు వచ్చాయంటే నేతలందరికీ ఓటరు మహాశయుడు దేవుడిలా కనిపిస్తాడు. అలాంటి ఓటరును ప్రలోభపెట్టేందుకు రకరకాల యత్నాలు మొదలు పెడతారు. మాయమాటలు చెబుతారు.. బుజ్జగిస్తారు.... వినకపోతే అదిరిస్తారు.. బెదిరిస్తారు... మద్యాన్ని ఎరగా వేస్తారు.. ఆపై నగదు కూడా ఇస్తారు.. ఇలా నాయకులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా తప్పే. ఓటు వేసేందుకు నగదు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి చేటు కూడా.. అలాంటి తప్పులు చేయకుండా పోటీలో ఉన్న అభ్యర్థులు జాగ్రత్త పడాలి.

- సంగం



- ప్రతి వ్యక్తి తన ఇంటిలో తాను ప్రశాంతంగా, ఏకాంతంగా జీవించే హక్కు ఉంది. దాన్ని అందరూ గౌరవించాలి.
- రోడ్డుపై ప్రజల రాకపోకలకు ఆటంకాలు కలిగించకూడదు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఊరేగింపులు జరుపుకోవాలి.
- ప్రదర్శనల్లో అల్లర్లకు పాల్పడకూడదు.
- ఓటరు స్లిప్పులపై ఏ పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు ఉండకుండా చూసుకోవాలి. సాదా కాగితం వాడాలి.
- పోలింగ్ రోజు వాహనాలు వాడే వారు నిబంధనలు పాటించాలి.

- అలా చేయడం నేరం కూడా..
- స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు అవకాశం ఇవ్వండి

- ఎంత పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి అయినా (పీఎం, సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు) ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేక అనుమతి పత్రం ఉంటేనే పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాలి. లేదా ఓటు వేయడానికి మాత్రమే బూత్‌లోకి అడుగుపెట్టాలి.
- ఎన్నికలకు సంబంధించిన ఏ ఫిర్యాదునైనా ఆర్వోకి అందచేయాలి.
- ఈ నిబంధనలు పాటించి ప్రశాంత ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి.

ఓటరు గుర్తింపు కార్డు ఎప్పటి నుంచి అమలు ?

తెలుసుకుందాం



నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 19 : ఓటరు గుర్తింపు కార్డును 1993లో ఎన్నికల ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ ప్రవేశపెట్టారు. 2011 జనవరి 25న మొట్ట మొదటి సారిగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25న ఏర్పాటైంది. అప్పటి నుంచి జిల్లా స్థాయిలో కలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఓటింగ్ యంత్రాలను 1999 ఎన్నికల్లో గోవాలో వినియోగించారు. 2013లో సుప్రీంకోర్టు ఓటింగ్ యంత్రాల్లో వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2004 నుంచి ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఎన్నికల సంఘం నిషేధించింది.

నెల్లూరు రూరల్

ఎన్నికల పర్వం

నెల్లూరు రూరల్‌కు రెండు నామినేషన్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 19 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో శుక్రవారం రెండో రోజు నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఇద్దరు నామినేషన్ దాఖలు చేశారు. ఎస్‌డీపీఐ (సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) అభ్యర్థిగా సయ్యద్ ఫాజిల్, టీడీపీ(తెలుగుదేశం పార్టీ) అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఇప్పటి వరకు మొత్తం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి.

పోస్టల్ బ్యాలెట్‌పై స్పష్టత ఇవ్వాలి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 : ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ విషయంలో గందరగోళం నెలకొందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డీ వెంకట రాజు, ఎస్ తిరుమలయ్యలు ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 6 నుంచి 7 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులను వివిధ హోదాల్లో ఎన్నికల విధులు నిర్వహిం చడానికి కేటాయించారన్నారు. వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం అందించే పోస్టల్ బ్యాలెట్ పంపిణీ విషయంలో స్పష్టత లేదన్నారు. ఎవరు ఎక్కడ, ఎప్పటి లోగా దరఖాస్తు చేసుకోవాలన్న దానిపై ఉన్నతాధికారులు సూచనలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన పరదీప్ కుమార్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 19: సాధారణ ఎన్నికలకు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలికుడు పరదీప్ కుమార్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియపై చర్చించారు.

నిరంతరం ప్రజలకు అందుబాటులో... : కోటంరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 19 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలు పరిష్కరించే ఎమ్మెల్యేగా పనిచేస్తానని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. హంగు ఆర్భాటాలు లేకుండా కేవలం నలుగురితో కలసి వచ్చి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఆర్డీవో మలోలాకు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రూరల్ నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, ఈసారి కూడా నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించాలని కోరారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టించాలన్నా, అమరావతి రాజధానిగా ఉండాలన్నా చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండే శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, ఇందూపూరు శ్రీనివాసులు, చిరంజీవి పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు గుర్తింపు : కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 19 : బీసీ కులాల ప్రజలను గుర్తించి వారికి తగిన గౌర వం ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనని నెల్లూ రు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో బీసీ కులస్తులు, సంచార జాతులకు చెందిన ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. బీసీలు ఆర్థికంగా, రాజకీ యంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు టీడీపీ ప్రభుత్వంలో కల్పించారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అఖండ మెజా ర్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంత రం వైసీపీకి రాజీనామ చేసి వచ్చిన 29వ డివి జన్ మాజీ కార్పొరేటర్ దంపతులు పావళ్ల మా ధవి, ప్రసాద్‌ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీ పీకి చెందిన ట్రేడ్ యూనియన్ నేత నడవడి ముత్యం గౌడ్, 31వ డివిజన్ రామకోటయ్యనగర్‌కు చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమా లలో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, భానుశ్రీ, రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

రూ.2 లక్షల నుంచి సీలింగ్‌ను రూ.5 లక్షలు పెంచాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 19 : రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఈహెచ్‌సీ, రీయింబర్స్‌మెంట్ క్లయిమ్‌లకు సీలింగ్‌ను రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ డీఆర్ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, కొత్తగా మంజూరైన డీఆర్‌లను వివరించారు. ప్రభుత్వ వైద్యకళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కే కాలేషా సాహెబ్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆహార నియమాలు, అలవాట్లను మార్చుకుంటే ప్రమాదకర జబ్బులు దరిచేరవని సూచించారు. వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సుశీల నేత్రాలయం ఆధ్వర్యంలో పెన్షనర్స్, వారి కుటుంబ సభ్యులకు నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఏ రమణయ్య, కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ శ్రీనాథ్, కోశాధికారి హజరత్తయ్య, ఎస్‌కే ఖాసిం పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న వీపీఆర్ కుటుంబం



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 19 : నెల్లూరు పార్లమెంటు ఎన్డీఏ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శుక్రవారం తెల్లవా రు జామున తిరుమల శ్రీవేంకటేశ్వస్వామిని దర్శించుకున్నారు. వారితోపాటు కుమారుడు అర్జున్‌రెడ్డి దంపతులు, కుమార్తె నీలిమారెడ్డి దంపతులు కూడా ఉన్నారు. శుక్రవారం ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకున్నారు.

వీపీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితరులు వీపీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ప్రజల మధ్య వేడుకలు

నెల్లూరు (విద్య) : ప్రజల మధ్యనే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(వీపీఆర్) జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 8వ డివిజన్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో వీపీఆర్‌ను ఎంపీగా, పొంగూరు నారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

ప్రజల అభీష్టం మేరకే అభివృద్ధి

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



ప్రచారంలో పొంగూరు నారాయణ తదితరులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 : ప్రజలందరి అభీష్టం మేరకు, వారి ఇష్టానుసారం మాత్రమే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి నెల్లూరును నెంబర్‌వన్ సిటీగా రూపుదిద్దుతానని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన నగరంలోని మూడవ మైలు సెంటర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా తమకు అండగా ఉండి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 42వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. 5వ డివిజన్‌లో పొంగూరు రమాదేవి, 45వ డివిజన్‌లో నారాయణ కుమార్తె సింధూర, నవాబుపేట ప్రాంతంలో మరో కుమార్తె శరణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

భవిష్యత్‌లో వైసీపీ కనుమరుగు..

రానున్న కాలంలో వైసీపీ పూర్తిగా కనుమరుగైపోతుందని, ప్రజలంతా ఆ పార్టీని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న నారాయణ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 100 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి నారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తాళ్లపాక అనూరాధ, కప్పిర రేవతి, తదితరులు పాల్గొన్నారు. కాగా, క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ నగర నియోజకవర్గ జనసేన నేతలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సమయం దగ్గర పడుతోందని, విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ఆశా వర్కర్లకు అగ్ని ప్రమాదాలపై అవగాహన

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు శుక్రవారం నగరంలోని కోటమిట్ట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆశా వర్కర్లకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం మెడికవర్ వైద్యశాలలో డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాక అధికారి ఎస్ వేణు గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 19 : నగరంలోని రైతుబజార్, ఎన్టీఆర్ నగర్, జగదీష్ నగర్, వెంకటేశ్వరపురం, బీవీ నగర్, గోమతినగర్ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోడిగాడితోట, వీవర్స్ కాలనీ, లక్ష్మీపురం, సత్యనారాయణపురం, శ్రీనివాసనగర్, సరస్వతీనగర్, ఏసీనగర్, శ్రీనగర్ కాలనీ, సాయినగర్, మారుతీనగర్, హెచ్‌పీ గ్యాస్ గోదాము, టిడ్కో సముదాయం, రామలింగాపురం, ముత్యాలపాళెం, వనంతోపు సెంటర్, ఉమ్మారెడ్డిగుంట, రవీంద్రనగర్, మాగుంటలేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, డీమార్ట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలియచేశారు.

రాష్ట్ర బాస్కెల్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 : నూజివీడులో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర జట్టును ఎంపిక చేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదం వాసు తెలిపారు. నెల్లూరులోని వీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా జట్టును ఆయన ప్రకటించారు. ఎండీ రెహమాన్, డీ మణి, ఎస్‌కే ఖలీమెయిద్దీన్, ఎం సంతోష్, వీ లక్ష్మీనరసింహ, కే సూర్యతేజ, సీహెచ్ మదన్, కే లక్ష్మీనరసింహ, కే లక్ష్మీశ్రీనివాస్, ఎం అరుణ్‌కుమార్, పీ జాషువా ఎంపికయ్యారని, చైతన్య శిక్షకుడిగా వ్యవహరిస్తారన్నారు.

24 నుంచి యోగ శిక్షణ

నెల్లూరు బీవీనగర్‌లోని సంఘమిత్ర విద్యాలయం ఆవరణలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30 వరకు ఇన్నర్ ఇంజనీరింగ్ సాధన ద్వారా శాంభవి మహాముద్ర, యోగక్రియ శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు మాధవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 9440535032, 9490894152 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జీజీహెచ్ కేన్సర్ రోగులకు ఆధునిక చికిత్సలు

● విశాఖ టాటా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ అధికారులతో చర్చలు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 19 : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ రోగులకు అత్యాధునిక చికిత్సలు అందించేందుకు తగిన ఏర్పాట్ల పరిశీలనకు విశాఖపట్నం టాటా హోమీ బాబా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు శుక్రవారం నెల్లూరు జీజీహెచ్‌కు వచ్చారు. ఇక్కడ కేన్సర్ రోగులకు అందిస్తున్న చికిత్సలు, వసతులను పరిశీలించారు. ఆధునిక లీనాక్ పరికరం ఏర్పాటు చేయాలని జీజీహెచ్ అధికారులు కోరగా అంగీకరించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌తో చర్చించారు. అంకాలజీ విభాగంతో సమావేశమయ్యారు. డాక్టర్ సిద్దానాయక్ మాట్లాడుతూ విశాఖ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యుల బృందం జిల్లాలోని పీహెచ్‌సీలలో పనిచేస్తున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలకు కేన్సర్‌పై నెల రోజులు శిక్షణ ఇస్తారని తెలియచేశారు. స్క్రీనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్యులతో పరీక్షిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ నుంచి వచ్చిన అధికారులు డాక్టర్ రోజా, స్నేహ శర్మ, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

● ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

నెల్లూరు(హరనాథపురం) : సీపీఎస్, జీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధ రించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కోరారు. నగరంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యా, కార్మిక ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీని సత్వరమే అమలు చేయాలని, సకాలంలో డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కేఆర్ సూర్యనారాయణ, కోచైర్మన్‌గా కే హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా సీహెచ్ పాపారావు, కేదారీశ్వరరావు, ఎం రమేష్‌కుమార్, రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ బాజీ, ఉప కార్యదర్శిగా ఆస్కార్ రావు, నరసింహారావు, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ రజాక్, రంగనాథ్‌బాబు, ఎంవీ ప్రభాకర్‌రావు, పరమేశ్వర్, ట్రెజరర్‌గా రమేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



చంద్రబాబు సభను జయప్రదం చేయండి

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 19: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం పొదలకూరు గేట్ సెంటర్‌లో నిర్వహించే ప్రజాగళం సభను జయప్రదం చేయాలని మండల టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి కోరారు. ఈ సభకు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఎన్టీఆర్ అభిమానులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సర్వేపల్లిలో నామినేషన్లు నిల్

వెంకటాచలం, ఏప్రిల్ 19: సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి రెండో రోజైన శుక్రవారం కూడా ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నఓబులేసు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఆర్వో కార్యాలయం ఏర్పాటు చేసి ఉండగా తొలి రెండు రోజులు నామినేషన్లు ఎవరూ వేయలేదు.

నేర నియంత్రణే లక్ష్యంగా గస్తీ : ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 19: నేర నియంత్రణే లక్ష్యంగా నెల్లూరు నగరంలో రాత్రి పూట గస్తీని ముమ్మరం చేశామని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నగరాన్ని మూడు సెక్టర్లుగా విభజించి ప్రతి సెక్టార్‌లో ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమించి, నగరంలో రాత్రంతా ముగ్గురు ఇన్‌స్పెక్టర్లతో గస్తీ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. రాత్రి వేళ్లలో జరిగే గ్రేవ్ కేసులపై ఉక్కు పాదం మోపుతూ, నేరాల కట్టడి, దొంగతనాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. కారణం లేకుండా రాత్రి వేళ్లల్లో తిరిగే ఆకతాయిలపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గస్తీ సమయంలో తాళాలు వేసిన ఇళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాప్‌లు, లాడ్జీలు, ఆలయాలు, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, ముఖ్యమైన కూడళ్లు, నిర్మానుష్య ప్రదేశాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కాగా, గురువారం రాత్రి నగరంలోని లాడ్జీల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వకూడదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నగరంలోని పాత పోలీసు కార్యాలయంలో గల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శుక్రవారం సందర్శించారు. సీసీ కెమెరాలు, ఎల్‌హెచ్‌ఎంఎస్, వీడియో వాల్, డయల్ 100, దిశ కంట్రోల్‌ను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శుక్రవారం రాత్రి ఎస్పీ సంతపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు.

రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలి

పొదలకూరు, ఏప్రిల్ 19: త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి ప్రజా ప్రభుత్వాన్ని తీసుకురావాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి అన్నారు. మండలంలోని తాటిపర్తిలో శుక్రవారం శృతిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలిరెడ్డి హనుమారెడ్డి, సుబ్బిరామిరెడ్డి, పల్లారపు కృష్ణయాదవ్, కండే మస్తానయ్య, సుజిత్‌రెడ్డి, పార్లపల్లి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



తాటపర్తి ఎన్నికల ప్రచారంలో శృతిరెడ్డి

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలి

తోటపల్లిగూడూరు: మండలంలోని వీలుకానిపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ గోపిరెడ్డి పావని, టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించి తెలుగుదేశం పార్టీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రోపుగుంట శివయ్య, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, సొరకత్తి శ్రీనివాసులు, గిద్దె శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులను ఆదరించండి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఎన్డీఏ ఉమ్మడి నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను ప్రజలు ఆదరించాలని కుమారుడు అర్జున్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన బుచ్చి నగర పంచాయతీలోని 14, 15 వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. వేమిరెడ్డి దంపతులను గెలిపించుకుని జిల్లాతోపాటు, కోవూరు నియోజకవర్గాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్దుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుల ఇన్‌చార్జ్‌లు బండ్ల కొండయ్య, కిషోర్, ఎంవీ శేషయ్య, హరనాథ్, దశరథ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న అర్జున్‌రెడ్డి

గ్రామాల్లో బీజేపీ, టీడీపీ నేతల ప్రచారం

వేమిరెడ్డి దంపతుల తరపున బీజేపీ, టీడీపీ నాయకులు శుక్రవారం బుచ్చి పట్టణం, మండలంలోని మినగల్లు, సాల్మానుపురంతోపాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లాతోపాటు కోవూరు నియోజకవర్గాన్ని అవినీతికి తావులేకుండా అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు వేమిరెడ్డి దంపతులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

REAL ESTATE

» Ready to occupy 1/2 acre gated converted ekhata 15 fully furnished rooms garden 9Cr, Nandi Hills Road, Bengaluru. Ph: **9677002197**

AJB -182075

WANTED

నెల్లూరులోని "కోమల విలాస్" హోటల్ నందు పని చేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన స్త్రీలు, క్యాషియర్ కావలెను. సమయం: 11.00 AM to నుంచి 4.00 PM. సం.ప్ర. సెల్: 98496 56370, 79896 85059

AJR-178073

పొలం అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కొండాపురం మండలం, ఆదిమూర్తిపురం గ్రామం లోని పొలం య.2.10 1/2 సెంట్లు అమ్మబడును. సంప్ర॥ సెల్ నెం: **9177372555.**

AJO-183734

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

యాళి వాహనంపై కోదండరాముడి దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 19: స్థానిక పెద్దూరులో సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం తిరిచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారు యాళి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళికృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు హనుమంతు వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వైభవంగా శాంతి ఉత్సవం

మనుబోలు, ఏప్రిల్ 19: గ్రామంలో సంగమేశ్వర బ్రహ్మోత్సవాలు ముగియగానే శాంతి ఉత్సవం నిర్వహిం చడం ఆనవాయితీ. ఈక్రమంలో విష్ణుమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గురువారం రాత్రి గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

విష్ణాలయంలో అన్న సంతర్పణ

మనుబోలు, ఏప్రిల్ 19: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో శుక్రవారం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా ఆమంచర్ల శ్రీకాంత్‌రెడ్డి, ప్రత్యూష దంపతులు, ప్రమీలమ్మ వ్యవహరించారు. అనంతరం ఉభయ దాతలు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటుచేశారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

వెంకటాచలం, ఏప్రిల్ 19: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంయుక్తంగా విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అభ్యసనాల అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, డీన్ సీహెచ్ విజయ, వీ స్వామి, కె పెంచలయ్య, ఆర్ అప్పారావు, ఎ జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి జన్మదిన వేడుకలు



వేమిరెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ప్రవీణ్ కుమార్ రెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 19: మండలంలోని నార్తు రాజుపాలెంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆయన చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా, ప్రశాంతిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కరకటి మలికార్జున, మందిపాటి రమణారెడ్డి, కరేటి మూరళీ తదితరులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చి నగర పంచాయతీలోని 15వ వార్డులో టీడీపీ, జనసేన. బీజేపీ నాయకుల ఆధర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు కుమారుడు అర్జున్‌రెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి నిర్వహించారు. ముందుగా అర్జున్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి వీపీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

గేదె కోసం చెరువులో దిగి యువకుడి గల్లంతు



చెరువువద్ద పరిశీలిస్తున్న పోలీసులు

మనుబోలు, ఏప్రిల్ 19: వీరంపల్లి చెరువులో ఇటీవల యువకుడు గల్లంతై మరణించిన సంఘటన మరువక ముందే మండలంలోని వడ్లపూడి చెరువులో గేదె కోసం దిగిన ఓ యువకుడు గల్లంతైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోసూరు శంకరయ్య కుమారుడు కోసూరు కిషోర్ (27) గేదెలు కాస్తుంటాడు. రోజువారీలాగానే ఇంటి నుంచి గేదెలను తీసుకుని పొలాలు, చెరువు వైపు వెళతుండగా ఓ గేదె చెరువులోకి దిగింది. దీంతో దానిని అదిలించేందుకు కిషోర్ చెరువులోకి దిగి లోతుకు వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ కనిపించకపోవడంతో తోటికాపరులు గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందితో వడ్లపూడి చెరువులో ఎంత గాలించినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

● రూ. 10 లక్షల ఆస్తి నష్టం

మనుబోలు, ఏప్రిల్ 19: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని అనుపల్లిపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండుబోయిన అశోక్‌కు చెందిన పూరింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. అనంతరం ఇంట్లో ఉన్న సిలిండర్ పేలి మంటలు పూర్తిగా వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బీరువాలో ఉన్న రూ. 2లక్షల నగదు, 10 సవర్ల బంగారం, దుస్తులు, వంట సామాగ్రి కాలి బూడిదయ్యాయని, రూ. 10లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు విఆర్వో శ్రీనువాసులు ఎదుట వాపోయాడు. ప్రమాద నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని విఆర్వో తెలిపారు.



కాలిబూడిదైన పూరిల్లు, సామగ్రి

● **ఆబ్బిసాహెబ్ కండ్రిగలో....**

వెంకటాచలం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఆబ్బిసాహెబ్ కండ్రిగలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన గుండుబోయిన అశోక్ నివాసంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి స్థానికుల సహకారంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే గ్రామానికి చేరుకుని మంటలను ఇతర నివాసాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.4లక్షలు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

దళితులను దగాచేసిన వైసీపీ : కొండా

విడవలూరు, ఏప్రిల్ 19: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఆదరించాలని విడవలూరుకు చెందిన కొండా వెంకయ్య కోరారు. శుక్రవారం విడవలూరు దళిత సంఘాల నేతలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ దళితులను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. దళితుల అభ్యున్నతికి ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏసుపోగు బాబు, జిల్లా దళిత సంఘర్షణ సమితి నాయకులు పాలెపు తిరుపాల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 7006
వెండి కిలో ధర	రూ. 85,600
వెండి ఒక గ్రాము	రూ. 87.60





ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ఫ్రైడే

- రేణిగుంటలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- 24మండలాల్లో వడగాడ్పులతో ఠారెత్తిన జనం



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 19:ఎండ తీవ్రత, వడగాడ్పులతో జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. శుక్రవారం ఉదయం 8నుంచీ సాయంత్రం 5గంటల వరకు తీవ్ర వేడి వాతావరణం కొనసాగింది.తిరుపతి నగరంలో ఎండ తీవ్రతకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రేణిగుంటలో 44.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. తిరుపతి అర్బన్‌లో 43.4డిగ్రీలు, డక్కిలిలో 42.79, తిరుపతి రూరల్‌లో 42.23, వెంకటగిరిలో 42.09, ఏర్పేడులో 41.93, నాయుడుపేట, బాలాయపల్లి, తొట్టంబేడు, చంద్రగిరిల్లో 41.9 డిగ్రీలు,శ్రీకాళహస్తిలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 24మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యల్పంగా కోటలో 35.3,ఆలంపూడిలో 34.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



● సీన్ రివర్స్

అక్కడ మూశారు ఇక్కడ ఎగబడ్డారు

తక్కువ ధర.. బ్రాండెడ్ మద్యం దొరుకుతుందని జిల్లాలోని మందుబాబులు తమిళనాడుకు వెళ్లడం సాధారణం. కానీ, శుక్రవారం మాత్రం తమిళనాడు మందుబాబులు మద్యం కోసం లోక్ మెమో రైళ్లలో సూళ్లూరుపేటకు తరలివచ్చారు. మద్యం దుకాణాలన్నీ వీరితో కిటకిటలాడాయి. మండుటెండలోనూ మందుబాబులు క్యూలో నిలబడడం విశేషం. ఎందుకిలా రివర్సులో వచ్చారని అనుకుంటున్నారా? తమిళనాడులో పార్లమెంటు ఎన్నికల వల్ల బుధవారం నుంచి శనివారం వరకు మద్యం షాపులు మూసేశారు. ఈ నాలుగు రోజులు ఆగలేక.. ఇలా వచ్చారిక్కడికి.

- సూళ్లూరుపేట

రెండవ రోజు 20 నామినేషన్లు

తిరుపతి ఎంపీకి 3... ఏడు అసెంబ్లీ స్థానాలకు 17

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండవ రోజైన శుక్రవారం 20 నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంటు స్థానానికి మూడు, ఏడు అసెంబ్లీ స్థానాలకు 17 చొప్పున మొత్తం 20 మంది అభ్యర్థులు 22 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు స్థానానికి వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మద్దిల గురుమూర్తి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ డమ్మీ అభ్యర్థిగా గురుమూర్తి సతీమణి నవ్యకిరణ్ నామినేషన్ వేశారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. వెంకటగిరిలో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, గూడూరులో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సూళ్ళూరుపేటలో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ విజయశ్రీ, సత్యవేడులో టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నామినేషన్లు వేశారు.రెండు సెగ్మెంట్లలో వైసీపీ, మరో రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. గూడూరులో వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తిరుపతిలో వైసీపీ అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి నామినేషన్లు వేశారు. చంద్రగిరిలో కాంగ్రెస్ తరఫున శ్రీనివాసులు అలియాస్ వాసు, సూళ్ళూరుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి గాదె తిలక్ బాబులు నామినేషన్లు దాఖలు చేశారు.

ఆరు చోట్ల ఇతరుల నామినేషన్లు : గూడూరులో టీడీపీ డమ్మీ అభ్యర్థిగా గోను సంధ్యారాణి, సూళ్ళూరుపేటలో వైసీపీ డమ్మీ అభ్యర్థిగా కిలివేటి సుభాషిణి, వెంకటగిరిలో టీడీపీ డమ్మీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున షేక్ షఫీ, ఇండిపెండెంట్‌గా ఉయ్యూరు ఆర్ముగం, తిరుపతిలో సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ నుంచీ ఎల్.ఎన్.లక్ష్మి, ఇండిపెండెంట్‌గా కె.కాంతారావు, శ్రీకాళహస్తిలో నేషనలిస్ట్ జనశక్తి పార్టీ తరఫున రమేష్, సత్యవేడులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా జడ్డా రాజశేఖర్ నామినేషన్లు వేశారు.



తిరుపతి పార్లమెంటుకు కాంగ్రెస్ అభ్యర్థి చింతామోహన్ నామినేషన్



గూడూరు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థి సునీల్ నామినేషన్

కిక్కిరిసిన కుప్పం

● చంద్రబాబు నామినేషన్ దాఖలుకు వెల్లువెత్తిన జనం



కుప్పం వీధుల్లో పసుపు జెండాలతో టీడీపీ శ్రేణుల ర్యాలీ



నామినేషన్ ఫీజు కోసం భువనేశ్వరికి విరాళాలు ఇస్తున్న నిరుద్యోగులు

కుప్పం, ఏప్రిల్ 19 : కుప్పం జనసంద్రమైంది.టీడీపీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులతో కుప్పం వీధులు కిక్కిరిశాయి.నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచే కాకుండా చిత్తూరుతోపాటు ఇతర జిల్లాల నుంచి అభిమానులు వేలాదిగా కుప్పం తరలివచ్చారు. లక్ష్మీపురంలోని వరదరాజస్వామి ఆలయంలో ఉదయం 10.45 గంటలకు నామినేషన్ పత్రాలను స్వామివారి పాదాల చెంత ఉంచిన భువనేశ్వరి ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మసీదు, చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. ఆయా ప్రార్థనాలయాల్లో పూజారులు, మతపెద్దలు ఆమెకు ఆశీర్వచనం పలికి దీవించారు. అక్కడి నుంచి ఆమె కుప్పం చెరువుకట్ట వద్దకు ఉదయం 11.15 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పటికే నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు వేచి చూస్తున్నాయి. డప్పులు, కోలాటాలు, డీజే శబ్దాల మధ్య నామినేషన్ కేంద్రానికి భారీ ఊరేగింపు బయలుదేరింది. ఓపెన్ టాప్ వాహనం ఎక్కిన భువనేశ్వరి దారి పొడవునా ప్రజలకు, అభిమానులకు అభివాదం చేస్తూ, చిరునవ్వులు చిందిస్తూ ర్యాలీలో సాగారు. మిట్టమధ్యాహ్నం 12 గంటల వేళ ఎర్రటి ఎండ మాడ్చేస్తున్నా ఏమాత్రం లెక్కచేయని జనం ర్యాలీలో ఆమె వాహనం వెంట పరుగులు పెట్టారు. యువత కేరింతలు కొట్టారు. డ్యాన్సులు వేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలి వద్దకు ర్యాలీ చేరుకునే సరికి మధ్యాహ్నం ఒంటి గంటయింది. ఇక్కడ భువనేశ్వరి ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, జన సమూహాన్ని ఉద్దేశించి 15 నిముషాలు ప్రసంగించారు. కుప్పం గడ్డ టీడీపీ అడ్డా అని, ఇక్కడ పసుపు జెండాకు తప్ప మరో జెండాకు స్థానం లేదని గర్జించారు. చంద్రబాబు సీఎం అయితేనే కుప్పంతోపాటు రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని నమ్మడం వల్లే అన్ని వర్గాల ప్రజలు ఆయన నామినేషన్ ఫీజు సొమ్మును విరాళాలుగా అందించారని, కుప్పం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని ప్రకటించారు.అనంతరం మధ్యాహ్నం 1.27 గంటలకు భువనేశ్వరి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసులుకు అందించారు.నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే వాహనం నుంచి దిగి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం వెంటరాగా నామినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.



టీడీపీ శ్రేణులకు భువనేశ్వరి అభివాదం

నామినేషన్ ఫీజుకు అభిమానుల విరాళాలు

చంద్రబాబు నామినేషన్ ఫీజుకు సంబంధించిన నగదు అభిమానుల నుంచి విరాళాలుగా సమకూరింది. ర్యాలీ ప్రారంభించడానికి ముందుగా భువనేశ్వరిని కలిసిన దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు నామినేషన్‌కు కావాల్సిన మొత్తాన్ని ఆమెకు విరాళంగా అందించారు. తమ భవిష్యత్తుకు చంద్రబాబు ద్వారానే భరోసా లభిస్తుందన్న నమ్మకంతో ఆయన గెలిచి తీరాలన్న ఆకాంక్షతో ఈ మొత్తం అందిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు ఆమెతో చెప్పారు.

చంద్రబాబు పర్యటనకు సర్వం సిద్ధం



గూడూరులో మహిళలతో చంద్రబాబు ముఖాముఖి కోసం సిద్ధం చేసిన ప్రాంగణం

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం జిల్లాకు వస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం ఉదయం 10.40 గంటలకు గూడూరు చేరుకుంటారు. అక్కడి సీఆర్ కళ్యాణ మండపంలో 11 నుంచీ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మహిళలతో జరిగే ముఖాముఖీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం గూడూరులోనే ముగించుకుని 2 గంటలకు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు వెళతారు. బహిరంగసభలో పాల్గొని సాయంత్రం 5.30 గంటలకు సత్యవేడు చేరుకుంటారు.6 నుంచీ 7.30 గంటల వరకూ సత్యవేడు క్లాక్ టవర్ కూడలిలో జరిగే ప్రజాగళం బహిరంగసభలో పాల్గొంటారు.అనంతరం తిరుపతికి చేరుకుని రాత్రి బస చేస్తారు.గూడూరు, సత్యవేడు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు అధినేత పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. ఎన్నికల వేళ అధినేత పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ అభ్యర్థులు, ముఖ్యనేతలు సైతం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పుత్తూరు బైపాస్‌లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం

మున్సిపల్ వైస్ చైర్మన్ సమీప బంధువు అరెస్ట్

వైసీపీ నాయకులే డంప్ చేశారన్న అనుమానాలు

పుత్తూరు అర్బన్/నారాయణవనం, ఏప్రిల్ 19: నారాయణవనం మండల పరిధిలోని కల్యాణపురం వద్ద గురువారం రాత్రి భారీ మద్యం డంప్‌ను పోలీసులు సీజ్ చేశారు.సీఐ భాస్కర్ నాయక్ కథనం మేరకు...పుత్తూరు బైపాస్ రోడ్డులోని కల్యాణపురం వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోలో 46 మద్యం కేసులను తరలిస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ గుర్తించారు. విచారణలో స్థానికుడైన శివ లీజుకు తీసుకుని నడిపిస్తున్న ఎస్ఎస్ఎస్ వెయింగ్ మెషిన్ వద్ద 239 మద్యం కేసులు నిల్వ ఉంచి, అక్కడి నుంచి మరొక చోటకు తరలిస్తున్నట్లు తేలింది.మద్యాన్ని అక్కడ నిల్వ చేసిన సీఎస్ దిలీప్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. దీంతో మొత్తం 285 మద్యం కేసులతో పాటు తిరునావక్కరసు, లీలాకృష్ణ, శివతో పాటు మద్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.అయితే మద్యం డంప్ వ్యవహారంలో అన్ని వేళ్లూ అధికార పార్టీ వైపే చూపిస్తున్నాయి.మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్న వారిలో ఒకరు పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సమీప బంధువు తిరువనావక్కరసు కాగా మరొకరు ఆటో డ్రైవర్. వీరిని ప్రశ్నించిన పోలీసులకు వేప్రిడ్జి గదిలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 239 కేసుల కర్ణాటక మద్యం గురించి తెలిసింది. ఇంత భారీస్థాయిలో మద్యం నిల్వ చేయడం వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే పోలీసులు అరెస్ట్ చేసిన తిరువనాక్కరసు గేటు పుత్తూరులో వైసీపీ నాయకుడిగా ఉన్నారు.ఈయన బంధువు శంకర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. పైగా పోలీసులు చెబుతున్నట్లు మద్యం డంప్ దొరికిన వేబ్రిడ్జి కూడా మరో వైసీపీ నాయకుడిదిగానే తెలుస్తోంది. కర్నాటక మద్యాన్ని ఎన్నికల కోసమే డంప్ చేసి ఉంచారనే ప్రచారం సాగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో మద్యం దిగుమతి చేసుకుని ఆయా మండలాల్లో డంప్‌లను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం.

ఏమిటిది భూమనా?

అభినయ్ ఆస్తులపై నగరంలో చర్చ

- టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన స్థలాల చుట్టూనే 6 ఎకరాలు
- తుడా చైర్మన్‌గా, టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడే కొనుగోళ్లు

తిరుపతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):తిరుపతి వైసీపీ అభ్యర్థి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అయిన అభినయ్ రెడ్డి భూములన్నీ టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాల చుట్టూనే వుండడంపై నగరంలో చర్చ జరుగుతోంది. మరొక విశేషం ఏమిటంటే.. కరుణాకర్ రెడ్డి తుడా చైర్మన్‌గా ఉన్న సమయం (2005-06)లోనూ, టీటీడీ చైర్మన్‌గా పదవిలో ఉన్నపుడే అభినయ్ రెడ్డి పేరిట 21 సార్లు ఆస్తుల కొనుగోళ్లు జరగడం.కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్ అయ్యాక (2007-08)లో మూడు సార్లు కొనుగోలు చేశారు. వడమాల పేట మండలం ఎస్వీపురం వద్ద 5.84 ఎకరాలు (ప్రస్తుతం టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చిన ప్రాంతం), సూరప్పకశం టౌన్‌షిప్ సమీపంలోని గాజుల మండ్యంలో 13.82 ఎకరాలు కలిపి మొత్తంగా 19.66 ఎకరాల భూమిని తుడా చైర్మన్‌గా ఉన్నప్పుడే కుమారుడి పేరిట కొన్నారు. 2008లో తిరుపతి రూరల్ మండలం కొత్తూరు దగ్గర 1.37 ఎకరాల స్థలం అభినయ్ పేరిట కొనుగోలు జరిగింది. తిరుచానూరు గ్రామ లెక్కదాఖలాలో రెండెకరాలు (సర్వే నెంబరు 473/4) 2021లో కరోనా సమయంలో కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నివాసం ఉంటున్న పద్మావతిపురంలో 2011లోనే నాలుగు చోట్ల రెసిడెన్షియల్ ఆస్తులను కొనుగోలు చేశారు. 2008లో హైదరాబాదులో 2225 చదరపు అడుగులు కలిగిన ఓ రెసిడెన్షియల్ బిల్డింగ్ అభినయ్ ఆస్తుల ఖాతాలో ఉంది. ఇక భార్య పేరిట 2011లో (సెజ్ సమీపంలో) వరదయ్యపాళం, పాండూరు దగ్గర 28 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ రూపంలో వచ్చింది.

టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల మర్మమిదేనా?

తిరుపతికి 22 కిలోమీటర్ల దూరంలో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం దగ్గర టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన సంగతి తెలిసిందే. దీని సమీపంలోనే అభినయ్ పేరిట దాదాపు ఆరెకరాల భూములున్నాయి. టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి తన కుమారుడి ఆస్తుల విలువ పెంచుకునేందుకే ఇక్కడ టీటీడీ ఉద్యోగులకు స్థలాలను ఎంపిక చేశారన్న విపక్షాల వాదన నిజమేనని అఫిడవిట్ బయటపెడుతోందని జనం అంటున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం ఈ భూముల్లో హైవేకి ఆనుకుని ఉన్న భాగంలో ఎకరం విలువ రూ1.50కోట్లు కాగా, లోపలి ప్రాంతంలో రూ87.12లక్షలు. మార్కెట్ విలువ ఇంతకంటే నాలుగు రెట్లు ఎక్కువవుంటుంది. అభినయ్ పేరిట రూ4.62 కోట్ల విలువైన చరాస్తులు, రూ17.05 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉండగా, ఆయన భార్య పేరిట రూ25.18 కోట్ల ఆస్తులు, రూ3.59కోట్ల విలువైన నగలు ఉన్నాయి. రూ86,09,751 అప్పులు, నగదు రూపంలో చేతిలో రూ.80 వేలు, భార్య దగ్గర రూ.50వేలు నగదు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపించారు.

కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయబ్బా?

కరుణాకర రెడ్డికి ఫుల్‌టైం రాజకీయాలు తప్ప వ్యాపారాలు చేసినట్టు (ముప్పై ఏళ్లక్రితం ట్రావెల్స్, సిద్ధార్థ జిరాక్స్ తప్ప) ఎక్కడా ఆనవాళ్లు లేవు. అభినయ్ రెడ్డి కూడా తండ్రి బాటలోనే ఉన్నారు. అఫిడవిట్‌లో మాత్రం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, కొన్ని ప్రైవేట్ కంపెనీల్లో షేర్లు కొన్నట్టు ఉంది. మరి ఇన్ని ఆస్తులు వీరికి ఎలా వచ్చాయనే చర్చ తిరుపతి జనంలో జోరుగా సాగుతోంది.

చింతా మోహన్‌కు ఆస్తి నిల్

తిరుపతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరు సార్లు పార్లమెంటు సభ్యుడు. అందులో ఓ పర్యాయం కేంద్ర మంత్రి. తాజాగా పదకొండో సారి ఎంపీగా నామినేషన్ దాఖలు చేశారు డాక్టర్ చింతా మోహన్. శుక్రవారం ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తి విలువ సున్నా. బ్యాంకు బ్యాలెన్స్ కూడా రూ.2వేల లోపే. చేతిలో మాత్రం రూ.40వేలు ఉన్నట్టు చూపించారు. స్థిరాస్తి సెంటు భూమి కూడా లేదని వెల్లడించారు. భార్య పేరుతో మాత్రం తిరుపతి రామచంద్ర నగర్‌లో ఓ ఇల్లు, దాని సమీపంలో రూ1.40కోట్ల స్థలం ఉన్నట్టు చూపించారు.



ఓ ప్రణాళిక... పద్ధతి లేకుండా ప్రజాప్రతినిధులు ఆదేశించడం... అధికారులు తలఊపడం తప్ప.. చేస్తున్న పని సరైనదా.. కాదా.. ? అన్నది కూడా చూసుకునే పరిస్థితి ఇరిగేషన్ శాఖలో లేకుండా పోయింది. నెల్లూరు నగరంలో పెన్నా రక్షణ గోడల నిర్మాణాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.




అసంపూర్తిగా పెన్నా రక్షణగోడ పనులు

వరదొస్తే 'రక్షణ' లేదు!



జగన్ హామీకి దిక్కు

- 20 నెలలుగా అతీగతీ లేదు
- ఐదోవంతు కూడా పూర్తికాని వైనం
- 2కి.మీ. నుంచి 650 మీటర్లకు తగ్గిన పెన్నా వాల్స్
- ఎస్టిమేషన్లు, రివైజ్ ఎస్టిమేషన్లతోనే సరి
- నిర్మాణం పూర్తికి మరో రూ.150 కోట్లు అవసరం
- జగనన్నా.. మీ హామీ ఏమైందన్నా ?



నెల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వస్తుందంటే నెల్లూరులోని వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీలు వణికిపోతున్నాయి. 2020, 2021 సంవత్సరాల్లో వరదలు రావడంతో ఈ ప్రాంతవాసులు కుదేలయ్యారు. కాగా 2021 డిసెంబరులో అక్కడ పర్యటించిన సీఎం వైఎస్ జగన్ రూ.వంద కోట్లతో పెన్నా రక్షణ గోడలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎనిమిది నెలలకు శంకుస్థాపన సందర్భంగా జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, నగర ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌లు.. ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కానీ రెండేళ్ల గడిచినా నేటికీ పునాదుల దశ దాటలేదు. ఆది నుంచి డిజైన్లను మార్చడం, ఎస్టిమేషన్లను రివైజ్ చేయడం తోనే కాలం గడిచిపోతోంది. కానీ చివరకు తేల్చిందేమిటంటే రక్షణ గోడలు పూర్తిగా నిర్మించేందుకు మరో రూ.150 కోట్ల వరకు అవసరమవుతాయని నిర్ధారించారు. ఇప్పుడు పెరిగిన అంచనాల మేరకు కొత్తగా మళ్లీ అనుమతులు వచ్చి పనులు పూర్తి చేయడం సాధ్యమేనా.. అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తే పూర్తవడానికి మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది.

● రాజకీయ జోక్యంతో..

2021 నవంబరులో వరదల సమయంలో రూ.80.56 కోట్ల అంచనాతో పొర్లుకట్టల నిర్మాణాలకు టీపీజీ అధికారులు టెండర్లు పిలిచారు. డిసెంబరులో టెండర్లు ముగిశాయి. అయితే ఈ పనిని దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా ఇద్దరు డిస్‌క్వాలిఫై అయ్యారు. మిగిలిన ఇద్దరు రివర్స్ టెండరింగ్‌లో నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీ పడడంతో చివరకు 13.38 శాతం లెస్‌కు(రూ.69.78 కోట్లు) శ్రీసాయి కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పనులు దక్కించుకుంది. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సూచించిన వారికి పని దక్కకపోవడంతో ఈ వర్కును రద్దు చేస్తారంటూ అప్పట్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అనుకున్నట్లుగానే అగ్రిమెంటు జరగాల్సిన సమయంలో మట్టికట్టల స్థానంలో కాంక్రీటు గోడలు నిర్మించాలన్న ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాక ఎస్టిమేషన్లు తయారు చేసిన ఇరిగేషన్ అధికారులకు ఈ విషయం ముందుగా తెలియదా.. ?అన్నదే అసలు ప్రశ్న. ఇక ఆ తర్వాత రూ.81.85 కోట్లకు అంచనాలు సవరించి 2022 ఏప్రిల్‌లో మరోమారు టెండర్లు పిలిచారు. ఈ దఫా కేవలం రెండు సంస్థలు మాత్రమే టెండర్లలో పాల్గొన్నాయి. మొదటిసారి మాదిరిగా ఇక్కడ కూడా పోటీ జరగలేదు. దీంతో 3.55 శాతం ఎక్సెస్‌తో రూ.84.76 కోట్లకు బెకెమ్-సిరి జాయింట్ వెంచర్ సంస్థ పనులు దక్కించుకుంది.

● పెరిగిన అంచనా

పోనీ ఈదఫా అయినా పనులు మొదలయ్యాయా అంటే అదీ లేదు. తీరిగ్గా పది నెలల తర్వాత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి పదిశాతం పనులు చేశారు. అయితే ప్రస్తుత డిజైన్ ప్రకారం కాంక్రీట్ వాల్ నిర్మిస్తే అది భారీ వరదలను తట్టుకోలేదని గుర్తించారు. దీంతో మళ్లీ డిజైన్ మార్పు అంటూ హడావిడి చేయడంతో పనులకు మళ్లీ బ్రేక్ పడింది. కొత్త డిజైన్లను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా కొన్ని నెలల తర్వాత ఇటీవల అప్రూవల్ వచ్చింది. అయితే కాంట్రాక్టర్ అగ్రిమెంట్ జరిగిన రూ.84.76 కోట్లకు అనుగుణంగానే కొత్త డిజైన్‌కు అనుమతులిచ్చారు. దీంతో వెంకటేశ్వరపురం నుంచి జాతీయ రహదారి దిగువన వరకు రెండు కిలో మీటర్ల మేర రక్షణ గోడ నిర్మించాల్సి ఉండగా అది 650 మీటర్లకు తగ్గిపోయింది. ఈ క్రమంలో పెన్నాకు మళ్లీ భారీ వరదలు వస్తే ఇళ్ల మధ్యలోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



కొత్త ఎస్టిమేషన్లు పంపాలి..

పెన్నా రక్షణ గోడల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే కొంత జాప్యం జరుగుతున్న మాటవాస్తవమే. రివైజ్ ఎస్టిమేషన్లు అప్రూవయ్యాయి. పనుల్లో వేగం పెంచుతాం. మిగిలిన దూరాన్ని రెండో విడతలో చేపట్టేలా కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాలి.

- వై పెంచలయ్య, ఇరిగేషన్ డీఈఈ

అన్నీ మంచి రోజులే !

● అభ్యర్థుల నామనక్షత్రాలను బట్టి ముహూర్తాల బేరీజు



సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. ఈనెల 25వతేదీ నామినేషన్ల దాఖలుకు తుదిగడువు. మంచి ముహూర్తంలో నామినేషన్ వేస్తే సగం విజయం సాధించనట్లేనని అభ్యర్థుల విశ్వాసం. జన్మనక్షత్రం, నామనక్షత్రాలను గణించి జ్యోతిషులు నామినేషన్లు వేసే ముహూర్తాలు నిర్ణయిస్తున్నారు. జిల్లాలో ఒక ఎంపీ, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తొలిరోజు కొందరు నామినేషన్లు వేశారు. రెండోరోజు శుక్రవారం మరికొందరు వేశారు. అయితే చైత్రమాసంలో ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు పరిశీలిస్తే అన్నీ మంచి ముహూర్తాలే ఉన్నాయి. ఈనెల 21వతేదీ ఉన్న మంచిరోజుల్లో శ్రేష్ఠమైన రోజని వేద పండితులు తెలిపారు. ఆ రోజున ఎక్కువమంది నామినేషన్లు వేసే అవకాశం ఉందని విశ్లేకులు భావిస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

చెల్లుబాటు అయ్యే అఫిడవిట్ సమర్పించాలి: రిజిస్ట్రార్

నెల్లూరు(హరనాథపురం): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు. అఫిడవిట్ తీసుకునేటప్పుడు ఆ నోటరీ పోర్సులో ఉన్నాడా... రెన్యువల్ చేసుకున్నాడా...అనే విషయాలు పరిశీలించాలన్నారు. రెన్యువల్ చేయించుకోని నోటరీల వద్ద అఫిడవిట్ తీసుకొంటే అది చెల్లదన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థుల గమనించాలన్నారు.

వడలు మీకు.. ఓట్లు మాకు!



ప్రచార చిత్రం

నెల్లూరు నగరంలో పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి, ఆయన కుమార్తెలు సింధూర, శరణి కొంత కాలంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జనార్దన్‌రెడ్డి కాలనీలో ప్రచారం చేస్తూ అక్కడున్న టిఫిన్ అంగడిలో వడలు కాల్చుతూ కనిపించారు రమాదేవి. ప్రచారంలో ప్రజలు చేసే వివిధ పనుల్లో వారు నిమగ్నమవుతూ ఓట్లు అడుగుతున్నారు.

పరదాల సరదా



పరదాల సరదాలకు ప్రభుత్వ అధికారులు ముగ్ధులవుతున్నట్లుంది. ఇందుకు కోవూరు ఎన్నికల కార్యాలయ ఆవరణం ఓ ఉదాహరణ. సార్వత్రిక ఎన్నికల నామి నేషన్ల దాఖలు సమయంలో ప్రతిసారీ కార్యాలయ ఆవరణలోకి ప్రధాన ద్వారం మాత్రమే లోపలికి వెళ్ళేందుకు గోడల మీద కంచె ఏర్పాటు చేస్తారు. నామి నేషన్ దాఖలు సమయంలో ఎంపిక చేసిన వా,ఇ,న లోపలికి అనుమతిస్తారు. ఇందుకోసం తహసీల్దారు కార్యాలయ ఆవరణ గోడ దూకి ఎవరూ లోపలకు రాకుండా పకడ్బందీగా ఇనుప కమ్ములతో బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల కార్యాలయానికి 100 మీటర్ల దూరం నుంచి రోడ్డుపై మూకమ్మడి జనసంచారం లేకుండా నిషేధాజ్ఞలు విధిస్తారు. కాగా ఈ దఫా విచిత్రంగా గోడపై ఏకంగా 20 అడుగుల ఎత్తుకు పరదాలు కట్టేసి అధికారులు తమ సరదా తీర్చుకున్నారు. ఏకంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణను పరదాలతో కప్పేయడంతో పలు వ్యంగ్య పలుకులు వినిపిస్తున్నాయి.

- కోవూరు

కలుగోళ్ల శాంభవిని దర్శిస్తే కలుగును జయం !

సెంటిమెంట్



ఏ ఎన్నికల్లోనైనా పోటీచేసే నేతలు తొలుత కావలిలోని కలుగోళ్ల శాంభవి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తే విజయం చేకూరినట్లేననే నమ్మకం ఉంది. ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు చేపట్టాలన్నా ముందుగా అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాతే నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ప్రచారం ప్రారంభించేవారు కూడా మొదటగా అమ్మవారిని దర్శించుకునే వెళతారు. ఈ నమ్మకం ఎక్కువమంది నేతల్లో నేటికీ ఉంది. చాలామంది నాయకులు ఇప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. మరి ఈ ఎన్నికల్లో అమ్మవారు ఎవరిని కరుణిస్తారో... విజయలక్ష్మి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే!

- కావలి

లక్షలు కావాలా నాయనా!?

ద్వితీయ శ్రేణి నాయకులకు బంపర్ ఆఫర్



గాసిప్స్

అవును.. ద్వితీయ శ్రేణి నాయకుల కాలమిది. ఎన్నికల్లో గెలుపే పరమావధిగా అన్ని రాజకీయ పార్టీలు కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ద్వితీయశ్రేణి నాయకులకు, కార్యకర్తలకు బాగా డిమాండ్ పెరిగింది. వారి స్థాయి, హోదాను బట్టి రూ. 5 లక్షల నుంచి 50 లక్షల వరకు ప్యాకేజీ కింద ముట్టచెబుతున్నారు. ఇటీవల జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గంలో కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రూ.20, రూ.50. రూ.10 లక్షలు చొప్పున ప్యాకేజీ ముట్టడంతో వారంతా పార్టీలు మారినట్లు పొలిటికల్ గాసిప్స్ హల్‌చల్ చేస్తున్నాయి. ఒక ప్రజాప్రతినిధికి అయితే ఏకంగా ఓ కారును కూడా కొనిస్తామంటూ హామీ ఇచ్చినట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తల తమ వంతు ఎప్పుడు వస్తుందా!? అని కళ్లలో ఒత్తులో వేసుకుని ఎదురు చేస్తున్నారు. తదానుగుణంగా గల్లీ లీడర్లు, కార్యకర్తలు సైతం తమ మాటేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ప్యాకేజీలు ఇవ్వకుంటే మరో పార్టీలో చేరిపోతామని బెదిరింపులకు దిగుతున్నారనే వార్తలూ గుప్పుమంటున్నాయి.

- ఆత్మకూరు

నీ ఓటుందో లేదో చూస్కో మావోయ్!



ఎటకారం

అల్లుడు : ఓయ్... మావోయ్.. బాగున్నావా!?

మామ : ఆ.. బాగున్నా అల్లుడూ. ఊరి నుంచి ఎప్పుడొచ్చావ్. అమ్మయి, పిల్లలు ఎలా ఉన్నారా? ఎన్నికలొచ్చాయి అంటున్నారు. ఎప్పుడు ఓటేసేది?

అల్లుడు : అదేంది మావా!? నీకు తెల్వదా!? అసలు మనూరు పోలింగ్ బూత్‌లో నీ ఓటు ఉందో.. లేదో చూసుకో. ఎందుకంటే లిస్టులో సుబ్బాగాడు, రామయ్య పేర్లు లేదాంటా ఉండారు!? కాబట్టి ఇప్పుడే చేసుకో!

మామ : ఎందిలే అల్లుడూ.. నా ఓటు ఉంటే ఉంటదీ లేకుంటే లేదు. నేను ఓటు ఏసినంత మాత్రాన ఏం ఒరుగుతుందిలే!?

అల్లుడు : అదేంది మామా. అంత మాటంటివి. ఓటనేది మనహక్కు. మనూరు బాగుపడాలన్నా!? మన బిడ్డల భవిష్యత్తు కోసం మంచి నాయకుడ్ని ఎన్నుకోవాలా! అందుకే మనం ఓటెయ్యాలి. రేపు పోలింగ్ బూత్‌కెళ్లి నీకు ఓటుందో లేదో చూస్కో!

మామ : సరేనయ్యా.. రేపే పోయి అధికారులను అడుగుతా!?

అల్లుడు : మంచిది మామ. ఇంకో విషయం ఈసారి ఓటుకు రెండు మూడు వేలు ఇస్తారని చెబుతా ఉన్నారు. ఆశపడి ఎవరికంటే వారికి ఓటు వేయొద్దు మామో. మన రాష్ట్రం, మనూరును ఎవరూ అభివృద్ధి చేస్తారో ఆలోచించి ఓటేయాలి. గుర్తుంచుకో!?

మామ : సరేలే అల్లుడూ లోకంలో ఏం జరుగుతుందో గమనిస్తున్నాలే. సరేయిన నాయకుడుకే నా ఓటు వేస్తా.

అల్లుడు : సరే మావా ఆరోగ్యం జాగ్రత్త!. అదుగో బస్ వస్తాంది. నే బయల్దేరుతా!

- అనంత సాగరం

ఎన్నికలు వచ్చాయంటే నేతలందరికీ ఓటరు మహాశయుడు దేవుడిలా కనిపిస్తాడు. అలాంటి ఓటరును ప్రలోభపెట్టేందుకు రకరకాల యత్నాలు మొదలుపెడతారు. మాయమాటలు చెబుతారు.. బుజ్జగిస్తారు... వినకపోతే అదిరిస్తారు.. బెదిరిస్తారు... మద్యాన్ని ఎరగా వేస్తారు.. ఆపై నగదు కూడా ఇస్తారు.. ఇలా నాయకులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా తప్పే. ఓటు వేసేందుకు నగదు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి చేటు కూడా.. అలాంటి తప్పులు చేయకుండా పోటీలో ఉన్న అభ్యర్థులు జాగ్రత్త పడాలి.

- సంగం

ఓటుకు నోటు.. ప్రజాస్వామ్యానికి చేటు !



- అలా చేయడం నేరం కూడా..
- స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు అవకాశం ఇవ్వండి

● ప్రతి వ్యక్తి తన ఇంటిలో తాను ప్రశాంతంగా, ఏకాంతంగా జీవించే హక్కు ఉంది. దాన్ని అందరూ గౌరవించాలి.

● రోడ్డుపై ప్రజల రాకపోకలకు ఆటంకాలు కలిగించకూడదు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఊరేగింపులు జరుపుకోవాలి.

● ప్రదర్శనల్లో అల్లర్లకు పాల్పడకూడదు.

● ఓటరు స్లిప్పులపై ఏ పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు ఉండకుండా చూసుకోవాలి. సాదా కాగితం వాడాలి.

● పోలింగ్ రోజు వాహనాలు వాడే వారు నిబంధనలు పాటించాలి.

● ఎంత పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి అయినా (పీఎం, సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు) ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేక అనుమతి పత్రం ఉంటేనే పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాలి. లేదా ఓటు వేయడానికి మాత్రమే బూత్‌లోకి అడుగుపెట్టాలి.

● ఎన్నికలకు సంబంధించిన ఏ ఫిర్యాదునైనా ఆర్వోకి అందచేయాలి.

● ఈ నిబంధనలు పాటించి ప్రశాంత ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి.

ఓటరు గుర్తింపు కార్డు ఎప్పటి నుంచి అమలు ?



తెలుసుకుందాం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 19 : ఓటరు గుర్తింపు కార్డును 1993లో ఎన్నికల ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ ప్రవేశపెట్టారు. 2011 జనవరి 25న మొట్ట మొదటి సారిగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25న ఏర్పాటైంది. అప్పటి నుంచి జిల్లా స్థాయిలో కలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఓటింగ్ యంత్రాలను 1999 ఎన్నికల్లో గోవాలో వినియోగించారు. 2013లో సుప్రీంకోర్టు ఓటింగ్ యంత్రాల్లో వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2004 నుంచి ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఎన్నికల సంఘం నిషేధించింది.

అక్కడ ల్యాండ్ అయితే... ఓడినట్టే

● సెంటిమెంట్

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ముహూర్త బలంతో పాటు కొన్ని సెంటిమెంట్లను బలంగా నమ్ముతుంటారు. ఆ సెంటిమెంట్లకు ఎదురుగా వెళ్ళేందుకు సాహసించరు. ఇలాంటిదే సత్యవేడులో ఓ సెంటిమెంట్‌ను రాజకీయ నాయకులు పాటిస్తుంటారు. సత్యవేడు పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెలిక్యాప్టర్ ల్యాండ్ అయితే ఓడిపోవడం ఖాయమనే నానుడి ఉంది. అప్పటి ప్రధాని ఇందిర గాంధీ, ఎన్టీఆర్, చంద్రబాబు తదితరులు ఎంతో మంది ఇక్కడ హెలికాప్టర్‌ను ల్యాండ్ అయిన ప్రతీసారి అధికారం కోల్పోవలసి వచ్చిందని ఇక్కడ నాయకుల నమ్మకం.

- సత్యవేడు



అట్టుంటనా!




ఎలక్షన్ షాట్స్



చావు అయినా సంబరం అయినా టపాసులు కాల్చి సందడి చేస్తుంటారు. థౌజండ్ వాలాలు, రాకెట్లు పేలుస్తుంటారు. ఇప్పుడా ట్రెండ్ మారింది. ఒక్కొక్క రాకెట్టునూ చేత్తో పట్టుకుని ఒత్తి ఎలిగించి ఎగరేసే సీను కనిపించడం లేదు. వీటి బదులు షాట్స్ రంగంలోకి వచ్చాయి. షాట్స్ బాక్స్‌ను నేలమీద పెట్టి ఒత్తి వెలిగిస్తే చాలు వరుసగా సుయ్.. సుయ్ మంటూ గాల్లోకి దూసుకుపోయి పెద్ద శబ్దం చేస్తూ పేలుతాయి. రంగురంగుల పూలు వెదజల్లుతాయి. 30 షాట్స్ నుంచి 240 షాట్స్ దాకా మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటి ధరలు రూ.1000 నుంచి 5000 దాకా ఉన్నాయి. ఎన్నికల ప్రచారాల్లో వీటికి మంచి గిరాకీ ఏర్పడింది. శ్రీకాళహస్తి సహా ప్రతి పట్టణంలోనూ టపాసుల దుకాణాలు దీపావళితో సంబంధం లేకుండా అమ్మకాలతో పండగ చేసుకుంటున్నాయి.

- శ్రీకాళహస్తి

నో స్టాక్



తిరుపతిలో చాలా వైన్ షాపులు ఎప్పుడు చూసినా మూతబడి కనిపిస్తున్నాయి. సంపూర్ణంగా మద్యం నిషేధించిన తర్వాతనే ఓట్లు అడుగుతా అని చెప్పిన జగన్ దాన్ని నిజం చేశారా అని మందుబాబులు హడలిపోతూ ఆరాలు తీస్తున్నారు. తీరా చూస్తే షాపుల ముందు నో స్టాక్ బోర్డులు వేలాడదీస్తున్నారు. రోజూ రాత్రి పది దాటినా తెరిచే ఉంటారు కదా ఇప్పుడేంది పగలే నో స్టాక్ అని పెట్టేస్తున్నారు? అని మందు ప్రియులు తెగ ఆశ్చర్యపడిపోతున్నారు. అసలు కతేమిటంటే మద్యానికి ఎన్నికల ఎఫెక్ట్ తగిలింది. ప్రచారాలకు పిలిచినా, సభలకు జనాన్ని పోగేసినా క్వార్టర్ బాటిల్ తప్పనిసరి అయ్యింది. దీంతో నాయకులు తెగ కొనేసి దాచేస్తున్నారు. అధికారంలో ఉన్న నాయకులు ప్రత్యర్థులకు ఈ అవకాశం ఇవ్వకుండా వచ్చిన స్టాకు వచ్చినట్టు దుకాణాలకు చేరకముందే తమ రహస్య ప్రదేశాలకు తరలించేస్తున్నారని చెబుతున్నారు. తిరుపతి జిల్లాలో 253 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 39 బార్లు వున్నాయి. ఇవి కాకుండా వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లు నాలుగు వున్నాయి. వీటి ద్వారా రోజుకు దాదాపు రూ 6.50 కోట్లు పైచిలుకు వ్యాపారం జరుగుతోంది. ప్రత్యేక రోజులు, పండగలు, పబ్బాలు అయితే రోజువారీ అమ్మకాలు రూ 10 కోట్లు దాటుతున్నట్లు సమాచారం. ఎన్నికల రోజుల్లో పది శాతంకి మించి రోజువారీ అమ్మకాలు పెరగడానికి లేదన్నది నిబంధన. ఇందువల్లే ఏ రోజు కారోజు స్టాకు తరలిపోతోందని తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాలు రాత్రి 8 గంటల వరకు తెరచి వుంచాలని, స్టాక్ అయిపోయిందని మూసివేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు మాత్రం హెచ్చరిస్తూనే ఉన్నారు.

- తిరుపతి (నేరవి భాగం)



వీరి ఉసురు తగలదా?

ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైరైతే ఎలాంటి చీకూచింతా ఉండదు. టెన్షను ఉండదు. కుటుంబ సభ్యులతో నిశ్చింతగా విశ్రాంత జీవితం గడిపేయొచ్చు.

- ఇదీ పెన్షనర్ల గత ఆలోచన. వైఎస్ జగన్ జమానాలో సీను మొత్తం మారిపోయింది. ఒకటో తేదీ వస్తుందంటే వీరందరిలోనూ టెన్షన్ మొదలవుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్)



మోసం గురూ!

ప్రశాంతంగా గడపాల్సిన విశ్రాంత ఉద్యోగుల బతుకు ఇప్పుడు దినదిన గండంగా మారింది. గతంలో రంఠనుగా ఒకటో తేదీనే పింఛను అందేది. ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా జీవించేవారు. జగన్ గద్దెనెక్కిన తరువాత పింఛనుదారుల కష్టాలు దారుణంగా తయారయ్యాయి. ఒకటో తేదీ రాగానే నెలవారీ చెల్లింపులు, ఖర్చులు, మందులకు చేతిలో నగదు లేక అల్లాడిపోతున్నారు. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ మధ్యలో అందాల్సిన పింఛను ఎపుడు వస్తుందో తెలియదు. డీఏ, పీఆర్సీ బకాయిలకు దిక్కే లేదు. . పీఆర్సీతో పెరగాల్సిన పెన్షన్‌లోనూ కోతలు పెడుతున్నారు. వైద్య భరోసాకు ఈహెచ్ఎస్ కింద నగదు మినహాయించుకుంటున్నా.. ఆరోగ్య ధీమా మాటలకే పరిమితమైంది. రిటైరయ్యాక ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా అందడంలేదు. పెన్షన్ పై ఆశతో రుణం తీసుకున్నవారు ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. వృద్ధాప్యంలో సీఎం జగన్ తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని పింఛనుదారులు మనోవేదనకు గురవుతున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని పింఛనుదారులు కలిస్తే మంత్రులు, ఎమ్మెల్యేలను అవహేళనగా మాట్లాడిన సందర్భాలూ ఉన్నాయి. జిల్లాలో సుమారు 20వేల మందికిపైగా పింఛనుదారులున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం 70 ఏళ్ల పైబడిన పెన్షనర్లకు 10శాతం క్వాంటం, 75ఏళ్ల పైబడిన వారికి 15శాతం క్వాంటం పెన్షన్ ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రెండింటినీ మూడుశాతం తగ్గించేశారు.



● విశ్రాంత ఉద్యోగులకు కరవైన మనశ్శాంతి ● ఒకటో తేదీన పెన్షన్ అన్నది గత కాలపు జ్ఞాపకం
● ఉద్యోగ విరమణ చేసినా అందని బెనిఫిట్స్ ● జగన్ జమానాలో లబోదిబోమంటున్న ప్రభుత్వ పెన్షనర్లు

ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు



పెన్షనర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడంలేదు. నాలుగేళ్లుగా అనేక ఆర్థిక ప్రయోజనాలను అందకుండా చేశారు. గత ప్రభుత్వాలలో నెలాఖరున లేదా 1వ తేదీన పింఛను వేసేవారు. జగన్ వచ్చాక 15వ తేదీ దాటాల్సిందే. నా సర్వీసులో ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు. ఈ ఐదేళ్లలో చాలా కష్టాలు పడ్డాం.

- గోపాల్, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

తీవ్ర అన్యాయానికి గురయ్యాం



పాత బకాయిలు చెల్లించలేదు. ప్రభుత్వం చేతిలో అన్ని విధాల వంచనకు గురయ్యాం. డీఏలు ఇవ్వకుండానే పింఛనులో జమచేసినట్లు చూపి ఆదాయపన్ను వసూలు చేయడం అన్యాయం. పెన్షనర్లకు అన్ని రకాల వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. తీరా ప్రైవేటు ఆస్పత్రికి వెళితే పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం మాపై వివక్ష చూపుతోంది.

- జయరామనాయుడు, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ప్రశాంతత కరువైంది

ఉద్యోగ విరమణ తరువాత ప్రశాంతంగా గడపాల్సిన వారు జగన్ ప్రభుత్వ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ సమయంలో జీతం నుంచి కొంతనగదును భవిష్యత్తు అవసరాల కోసం దాచుకుంటే రిటైరయ్యాక ప్రభుత్వం చెల్లించకపోవడ దుర్మార్గం. తక్షణమే చెల్లించాల్సిన బెనిఫిట్స్ కోసం నెలల తరబడి తిప్పించుకుంటున్నారు. ఇంత అన్యాయం ఎప్పుడూ చూడలేదు.

- కృపావరమ్మ, ఏపీఎస్‌జీఆర్ఈఏ మహిళా కార్యదర్శి



చాలా ఇబ్బందులు పడుతున్నాం

గతంలో ప్రతి నెలా 1వతేదీనే పింఛను వచ్చేది. దాని మీదే ఆధారపడి జీవిస్తున్నాను. మా అబ్బాయి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.10వేలు మాత్రమే జీతం .దానికి నా పింఛను తోడైతే కుటుంబం గడిచేది. ప్రస్తుతం పింఛను జమ ఆలస్యం చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

- మునస్వామి, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి

చెవిలో పువ్వు

ఏడుకొండల మీద ఆన.. ఏమైంది సాములా?

"మీరు న్యాయమైన హక్కు కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం మెడలు వంచి అయినా టైం స్కేలు తీసుకొస్తాం. లేదా మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల్లో టైం స్కేల్ ఇస్తాం'

- 2019లో సమ్మె చేస్తున్న ఎస్వీయూ ఎన్ఎంఆర్ ఉద్యోగుల టెంట్‌లో భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.

సీన్ కట్ చేస్తే.. ప్రతిపక్షంలోఉండగా వీరోచితంగా పోరాడి వీరు టైం స్కేల్ తీసుకురాలేకపోయారు. మరి అధికారంలోకి వచ్చాక? ఇద్దరూ ఎమ్మెల్యేలే. పైగా సీఎంకి సన్నిహితులు కూడా. అయినా టైం స్కేల్ కత మరిచిపోయారు. ఆనాడు 300 మంది ఉద్యోగులను ఉద్దేశించి ఊగిపోతూ ప్రసంగించారు. ఆరునెలలు ఓపికపట్టండి వైసీపీ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో డిమాండ్లు పరిష్కరిస్తామని ఎదురుగా కనిపించే ఏడుకొండల సాక్షిగా ధాటీగా చెప్పి చప్పట్లు కొట్టించుకున్నారు. జేజేలు చెప్పించుకున్నారు. జగన్ సీఎం అయ్యాక వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చెవిరెడ్డికి నాలుగు పదవులు వచ్చాయి. కరుణాకర్ రెడ్డికి జోడు పదవులు దక్కాయి. ఎస్ఎంఆర్‌లకు మాత్రం మొండి చేయి మిగిలింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరి వర్తమానం

వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అసమ్మతి సెగలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన గట్టిగా ఎదురీదుతున్నారు. సామాన్యులతో కలవరనే ముద్ర పడిన ఈయన తమతో కూడా సఖ్యతగా లేరని స్వపక్ష నేతలు నెమ్మది నెమ్మదిగా దూరమవుతున్నారు. సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకేమండలాల పెత్తనం కట్టబెట్టడం పార్టీలో అసంతృప్తులను రాజేసింది. రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వద్దని జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పార్టీ ఆవిర్భావం నుంచి జెండామోసిన కలిమలి రాంప్రసాద్‌రెడ్డి వంటి నేతలు బాహాటంగానే తిరుగుబాటు చేశారు. అసమ్మతి నేతలందరూ రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఇండిపెండెంటుగా పోటీచేస్తామని హెచ్చరించినా ఆయనకే టికెట్ ఖరారు చేశారు. ఇవన్నీ వైసీపీ అభ్యర్థికి ప్రతికూలాంశాలుగా మారాయి.

- వెంకటగిరి, డక్కిలి

నేదురుమల్లికి అసమ్మతి ఉక్కపోత

● వైసీపీలో కలసిరాని నాయకులు ● ఆనం ప్రభావంతో చేజారిన క్యాడర్
● యువ మహిళా అభ్యర్థితో టీడీపీలో జోష్

వైసీపీకి ఆనం స్ట్రోక్

ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడం వైసీపీ అభ్యర్థిపై తీవ్ర ప్రభావం చూపనుంది. 2019 ఎన్నికల్లో ఈయన 38 వేల పైచిలుకు ఓట్ల మెజారిటోతో విజయం సాధించారు. ఆయన పార్టీ మారడంతో నియోజకవర్గంలోని ఆయన అనుచరులందరూ టీడీపీ గూటికి చేరారు. ఈ పరిణామం వైసీపీకి భారీగా నష్టం కలిగిస్తుందని భావిస్తున్నారు.



నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి



కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

లక్ష్మీసాయిప్రియ అరంగేట్రం

టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న లక్ష్మీసాయిప్రియ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె. ఈమె విద్యావంతురాలు కావడంతో మహిళలు, యువతను బాగా ఆకట్టుకుంటున్నారు. ఆమె తండ్రి స్థానికుడు కావడం, ఎమ్మెల్యేగా గతంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు ఈమె విజయానికి దోహదపడనున్నాయి. ఎన్నికల ప్రచారంలో లక్ష్మీసాయిప్రియ తనదైన శైలిలో దూసుకు వెళ్తున్నారు. ప్రజలను ఆకర్షించేలా.. ఆలోచింపచేసేలా ఆమె ప్రసంగం కొనసాగుతోంది. చిన్న వయస్సులోనే రాజకీయ రంగప్రవేశం చేసిన ఈమె పట్ల సానుకూలత కనిపిస్తోంది. ఇటీవల మండలాల్లో కొందరు ప్రభావిత నేతలు తమ అనుచరులతో పెద్ద ఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామం టీడీపీ అభ్యర్థికి బలాన్ని చేకూర్చింది.

తిరుపతి చరిత్ర

అధినాయక ..వేదిక

● ఎన్టీఆర్, చిరంజీవికి పట్టం కట్టిన ఆధ్యాత్మిక నగరి

● చంద్రబాబు విద్యార్థి నేతగా ఎదిగింది ఇక్కడే

తిరుపతి.. తిరుమలేశుని దర్శనానికి ముఖద్వారం. దేశంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక నగరం. మన రాష్ట్రం నుంచే కాదు దేశవ్యాప్తంగా అనునిత్యం వేలాది మంది దర్శించే ప్రాంతమిది. ఏడు కొండలవాడిని దర్శించుకోవాలంటే ఈ నగరంలో అడుగు పెట్టాల్సిందే. పేరులోనే పవిత్రత ఉట్టిపడే తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం విశేషాలు పరికిస్తే.. 1955లో తిరుపతి, రేణిగుంట మండలాల (తిరుమలతో కలిపి)తో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి.

● అగ్రనేతలకు వేదిక

టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ మొదటి సారి తిరుపతినుంచే పోటీ చేసి గెలుపొందారు. ప్రజారాజ్యం పార్టీ తిరుపతిలోనే పురుడుపోసుకుంది. చిరంజీవి కూడా ఇక్కడనుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతిలోనే రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు.

ఎమ్మెల్యేలు

1955	ఆర్.నాదముని రెడ్డి	కాంగ్రెస్
1962	ఆర్.నాదముని రెడ్డి	కాంగ్రెస్
1967	ఎ.ఈశ్వర్ రెడ్డి	స్వతంత్ర
1972	వి.శిఖామణి	కాంగ్రెస్
1978	ఎ.ఈశ్వరరెడ్డి	కాంగ్రెస్(ఐ)
1983	ఎన్టీ రామారావు	టీడీపీ
1983	(ఉప ఎన్నిక) కె.శ్యామల	టీడీపీ
1985	మబ్బు రామిరెడ్డి	కాంగ్రెస్
1989	మబ్బు రామిరెడ్డి	కాంగ్రెస్
1994	మోహన్	టీడీపీ
1999	చదలవాడ కృష్ణమూర్తి	టీడీపీ
2004	ఎం.వెంకటరమణ	కాంగ్రెస్
2009	కె.చిరంజీవి	ప్రజారాజ్యం
2012	(ఉప ఎన్నిక)కరుణాకర్ రెడ్డి	వైసీపీ
2014	ఎం.వెంకటరమణ	టీడీపీ
2015	(ఉప ఎన్నిక) సుగుణమ్మ	టీడీపీ
2019	కరుణాకర్ రెడ్డి	వైసీపీ

ప్రస్తుతం
మండలాలు: తిరుపతి అర్బన్
ఓటర్ల సంఖ్య: 3,01,041
పురుషులు: 1,49,160
స్త్రీలు: 1,51,846
ఇతరులు: 35

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



● చెప్పాడంటే.. చేయడంతే!

ఈ వంతెన ఆరు నెలల్లో
పూర్తి చేసేస్తా

● గూడూరులో గాల్లో కలిసిపోయిన జగన్ హామీ



రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

ఎన్నో ఏళ్లుగా ఉన్న అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన (ఆర్వోబీ)ను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేసేస్తా.

- 2018 జనవరి 28న పాదయాత్రగా గూడూరు వచ్చిన నాటి విపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ ఇది. ఏడాదిన్నర తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. చూస్తుండగానే పదవీకాలం ముగిసింది. ఆయన ఇచ్చిన హామీ గాల్లో కలిసిపోయింది. మళ్లీ ఎన్నికల ప్రచారంలో గూడూరుకు వస్తే దీనికి ఏం చెబుతారో? ఇంకే హామీ ఇస్తారోనంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

గూడూరు నడిబొడ్డున ఉన్న గూడూరు-చెన్నై, గూడూరు-తిరుపతి రైల్వే ట్రాక్‌లు పట్టణాన్ని వన్ టౌన్, టూ టౌన్‌గా విభజిస్తున్నాయి. రైల్వే జంక్షన్ కావడంతో రైళ్ల రాకపోకలు అధికం. రెండుట్రాక్‌లపైనా గేట్లు వేస్తుండటంతో అటు ఇటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికి పరిష్కారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2010లో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేశాయి. రైల్వే శాఖ రూ.16 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.23 కోట్లు విడుదల చేశాయి. ఐసీఎస్ రోడ్డులోని ఎస్ఎంజీ పాఠశాల నుంచి మొదలయ్యే ఆర్వోబీ రెండు మార్గాలుగా విడిపోయి ఒకటి అడవయ్యకాలనీ వద్ద.. మరొకటి టూ టౌన్‌లోని సిరామిక్ కళాశాల వద్ద రోడ్డును కలవాలి. 2011 మార్చిలో పనులు మొదలయ్యాయి. రైల్వే శాఖ ఇచ్చిన రూ. 16 కోట్లతో రెండు ట్రాక్‌లపై ఆర్వోబీ నిర్మాణం పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.23 కోట్లు ట్రాక్‌లకు ఇరువైపులా బ్రిడ్జి కొనసాగింపు పనులకు చాలక ఆగిపోయాయి. భూసేకరణ, ఆర్వోబీ కోసం తొలగించిన భవనాలు, ఇళ్లకు పరిహారంతో పాటు పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మళ్లీ ప్రభుత్వం 2015లో రూ.40 కోట్లు అదనంగా మంజూరు చేసింది. రూ.36 కోట్లతో ఐదుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆరు నెలల్లో పూర్తి చేసేస్తానంటూ గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న జగన్.. ఐదేళ్లుగా పట్టించుకోలేదు.

- గూడూరు



గూడూరులో అసంపూర్తిగా వున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి

నేడు చంద్రబాబు గూడూరు పర్యటన

మహిళల ముఖాముఖికి సర్వం సిద్ధం

గూడూరు, ఏప్రిల్ 19: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శనివారం గూడూరులో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు చిల్లకూరు జాతీయ రహదారి సమీపంలోని వరగలి క్రాస్‌రోడ్డు వద్దకు హెలిక్యాప్టర్‌లో చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి పట్టణంలోని సీఆర్‌రెడ్డి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన సభలో మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. శనివారం చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ శ్రేణులు రక్తదానశిబిరంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సభ ఏర్పాట్లును మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తానంకి నానాజీ తదితరులు పర్యవేక్షిస్తున్నారన్నారు.

సైకో పాలనకు చరమగీతం: పాశిం



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 19: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న సైకో పాలనకు రానున్న ఎన్నికలలో చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లి వాసులను కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెరిగిన విద్యుత్, నిత్యావసరాలు, పెట్రో ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా కుదేలయ్యారన్నారు. మద్యం నిషేధిస్తానని చెప్పిన జగన్ దాన్ని విస్మరించి నాశిరకాల విక్రయాలతో కోట్ల రూపాలను దోచుకున్నాడని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలన్నా టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.కరిముల్లా, సూర్యనారాయణ, వి.వెంకటేశ్వర్లు, చిరంజీవి, శివ, సుప్రజ, సురేఖ, మమత తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలు

గూడూరు అర్బన్: టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్‌కు అందజేశారు. అదేవిధంగా వైసీపీ తరుపున మేరిగ మురళీధర్ నామినేషన్‌ను వైసీపీ నాయకులు ఆర్వోకు అందించారు. దీంతో శుక్రవారం గూడూరు నియోజకవర్గానికి సంబంధించి 3 నామినేషన్లు దాఖలయ్యాయి.

టీడీపీ నామినేషన్ల దాఖలు



కురుగొండ్ల రామకృష్ణ తరపున ఆయన సతీమణి సింధు, లక్ష్మీసాయిప్రియ తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న గంగోటి



వెంకటగిరి, ఏప్రిల్ 19 : వెంకటగిరి అసెంబ్లీ నియోజక వర్గంలో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మంచి రోజు కావడంతో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆయన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ తమ నామినేషన్లను తమ ప్రతినిధుల ద్వారా దాఖలు చేయించారు. వారు ఇద్దరు పట్టణంలో అందుబాటులో ఉన్నా నామినేషన్ కేంద్రానికి వెళ్లలేదు. కురుగొండ్ల రామకృష్ణ నామినేషన్ పత్రాలను ఆయన సతీమణి సింధు ద్వారా దాఖలు చేయించగా, లక్ష్మీసాయిప్రియ నామినేషన్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు దాఖలు చేశారు. ఈనెల 24న లక్ష్మీసాయిప్రియ మరో సెట్టు నామినేషన్ వేస్తారని తెలిసింది.

వెంకటగిరిలో నాలుగు...

వెంకటగిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాలుగు నామినేషన్లు దాఖలైనట్టు ఆర్వో ధ్యాన్‌చంద్ తెలిపారు. టీడీపీ తరపున రెండు సెట్ల నామినేషన్లు దాఖలు కాగా, స్వతంత్ర అభ్యర్థి ఆర్ముగం, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కరిస్టు పార్టీ తరపున షేక్ షఫి నామినేషన్లు సమర్పించినట్టు ఆయన తెలిపారు.

సూళ్లూరుపేటలో మూడు...

సూళ్లూరుపేట: టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్వో చంద్రమునికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అదే విధంగా కాంగ్రెస్ అభ్యర్థి జి.తిలక్‌బాబు తొలిసెట్ నామినేషన్ వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు వైసీపీ డమ్మీ అభ్యర్థిగా కిలివేటి సంజీవయ్య సతీమణి కిలివేటి సుభాషిణి నామినేషన్ వేశారు.

ఉడతావారిపాళెంలో ఘర్షణ

చిల్లకూరు, ఏప్రిల్ 19: మండలంలోని ఉడతవారిపాళెంలో గురువారం అర్ధరాత్రి ఘర్షణ జరగడంతో శుక్రవారం రెండు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. గ్రామానికి చెందిన షాజిద్‌కు, చిన్నోడికి మధ్య వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో ఇరు వర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టేడు విద్యార్థుల ప్రతిభ

కోట, ఏప్రిల్ 19 : మండల పరిధిలోని చిట్టేడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభా పాటవాలు చూపడంతో శుక్రవారం హెచ్‌ఎం నిర్మలాదేవి, సైన్స్ ఉపాధ్యాయురాలు సువర్ణ షీల్డ్‌లు, జ్ఞాపికలతో అభినందించారు. ఇక్కడ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారు. 9వ తరగతి చదువుతున్న జ్యోతిప్రకాష్ జాతీయస్థాయిలో 3వ బహుమతిని సాధించడంతో అభినందించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

వాకాడు/ చిట్టమూరు, ఏప్రిల్ 19: ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని వాకాడు తహసీల్దారు నరసింహారావు అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్టు చిట్టమూరు తహసీల్దార్ శ్రీనివాస శర్మ తెలిపారు.

మద్యం మత్తులో...

- అంగళ్లపైకి దూసుకెళ్లిన కారు
- తప్పిన పెను ప్రమాదం



వెంకటగిరి, ఏప్రిల్ 19: పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద ఓ కారు రోడ్డు పక్కనే ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంలో పెనుప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు... డ్రైవరు మద్యం తాగి కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు.ఈ సంఘటనలో రెండు అంగళ్లు ధ్వంసం అయ్యాయన్నారు. కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల సామగ్రి స్వాధీనం

తడ, ఏప్రిల్ 19: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సామగ్రిని చెక్‌పోస్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న లగేజీ వాహనాన్ని భీములవారిపాళెం ఎన్నికల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన పోలీసులు అందులో ఎన్నికల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జీఎస్టీ బిల్లు లేకపోవడంతో సుమారు రూ.2.43 లక్షల విలువైన జెండాలు, ప్లకార్డులు, జెండా కర్రలున్నట్లు తెలిపారు. నెల్లూరు కాంగ్రెస్ అభ్యర్థి రాజు కు వీటిని సరఫరా చేస్తున్నట్లుగా తేలింది.

ప్రత్యామ్నాయం చూపని పోలీసులు... ఇబ్బందుల్లో స్థానికులు

నామినేషన్ ముంగిట జనానికి తిప్పలు



పోలీసులతో స్థానికుల వాగ్వాదం

తడ, ఏప్రిల్ 19: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందనట్లుగా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సూళ్లూరుపేటలో ప్రజలకు చుక్కలు చూపెడుతోంది. సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నామినేషన్లను దాఖలు చేసేందుకు తహసీల్దారు కార్యాలయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు అక్కడ నుంచి 100 మీటర్ల దూరం వరకు నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు. ఆ నిబంధన స్థానికులకు శాపంగా మారింది. సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలో ఈ కార్యాలయం ఉంది. ఆ కార్యాలయానికి చుట్టూ 100 మీటర్ల పరిధిలో పోలీసుల బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా రోడ్లు పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయాయి. రైల్వేగేటుకు పరమడ, తూర్పు వైపు పట్టణం విస్తరించి ఉంది. ఇలా రెండు వైపులా ప్రజలు రాకపోకలకు రైల్వేగేటు మార్గం ఒక్కటే ఉంది. ఆ దారి మూసివేస్తే సుమారు 4 కిలోమీటర్లు చుట్టుకుని శ్రీహరికోట ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా రాక పోకలు సాగించాలి. అయితే పోలీసులు ఇవన్నీ తమకు పట్టవన్నట్టు 100 మీటర్ల వరకు అనుమతించేది లేదంటూ బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకుంటున్నారు. దగ్గరి దారి మూసివేయడంపై స్థానికులు పోలీసులను నిలదీశారు. అయితే పోలీసులు ఎవరినీ అనుమతించడం లేదు. ఇదే సమయంలో ఓ నాయకుడికి ఆర్వో కార్యాలయం ప్రాంగణంలో గంటపాటు అక్కడే కూర్చుంటే ఆయనకు అన్ని సౌకర్యాలు కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరో నాయకుడు నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థితో వచ్చి ఇదే 100 మీటర్ల లోపు నడిరోడ్డుపై పోలీసుల సమక్షంలోనే కుర్చీలో సేదదీరారు. సామాన్యులకైతే ఈ నిబంధనలు అన్నీ ఉంటాయని రాజకీయ నాయకులకైతే వర్తించవని పోలీసులు మరోసారి రుజువు చేశారంటూ స్థానికులు వాపోయారు.

జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం



8వ వార్డులో లక్ష్మీసాయిప్రియ ప్రచారం

వెంకటగిరి, ఏప్రిల్ 19: జగన్‌ను సాగనంపేందకు ప్రజలు సిద్ధం కావాలని టీడీపీ అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ప్రజలను కోరారు. శుక్రవారం ఆమె పట్టణ పరిధిలోని 8వ వార్డులో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉద్ధరి స్తాడని నమ్మి ప్రజలు జగన్‌కు పట్టం కడితే రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశాడన్నారు. రామ రాజ్య స్థాపన టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఇంటి బిడ్డగా ఆదరిస్తే కష్టాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. పి.రాజేశ్వరావు, జి.గోపీ నాయుడు, కౌన్సిలర్ చంద్రశేఖరరెడ్డి, ఎం.ఆనంద్, ఆర్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 19: సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం షార్‌లోని కురుప్ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి విజిలెన్స్ చీఫ్ అధికారి కరుణారాజు విచ్చేసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, అధికారులు శ్రీనివాస రెడ్డి, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గతంలో దారి మళ్లించిన నిధులివ్వాలి

సర్పంచుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి

పెళ్లకూరు, ఏప్రిల్ 19 : కేంద్రప్రభుత్వం గతంలో విడుదల చేసిన రూ. 8,629 కోట్లు పంచాయతీ నిధులను వెంటనే విడుదల చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ సర్పంచుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పెళ్లకూరులో ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు జమచేయలేదన్నారు. దీంతో ఈ నెల 15న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనాను ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ సర్పంచుల సంఘం, రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో కలసి నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశామన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 998.82 కోట్లు విడుదల చేసిందన్నారు. టీడీపీ సీనియర్ నేత పేరం మధుసూదన నాయుడు, ఏపీ సర్పంచుల సంఘం కార్యదర్శి టీకే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

గూడూరు, ఏప్రిల్ 19: పట్టణంలోని కోనేటిమిట్ట కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి గరుడ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి హోమాది పూజలు నిర్వహించారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

గూడూరు, ఏప్రిల్ 19: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని బీజేపీ పట్టణాధ్యక్షుడు బాలకృష్ణమనాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాధుపేట, జనార్దన రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట బిందురెడ్డి, దయాకర్, సురేష్‌బాబు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏకి అండగా నిలవండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





మందకృష్ణతో మాట్లాడుతున్న వరప్రసాదరావు - నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డితో వరప్రసాదరావు తదితరులు

చంద్రగిరి/గూడూరు/కోట, ఏప్రిల్ 19:రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి కృషి చేస్తుందని అటువంటి కూటమికి అందరూ అండగా ఉండాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం చంద్రగిరిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణతో సమావేశం అయ్యారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం ఎంఎస్‌పి సమావేశంలో మందాకృష్ణమాదిగతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ లక్ష్యాలను అర్థం చేసుకున్న వ్యక్తి వరప్రసాదరావు అని ఆయనకు అండగా ఉంటామని ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. అనంతరం వరప్రసాదరావు మాట్లాడుతూ వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కలసి కట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు.

గూడూరులో ...

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు శుక్రవారం ఉదయం గూడూరులో పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఎంపీగా తనకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్కుకు వెళ్లి అక్కడ స్థానికులతో మాటామంతి జరిపారు. పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దళితులంటే జగన్‌కు చులకన...

సీఎం జగన్‌కు దళితులంటే చాల చులకన భావమని అందుకే 23 మంది దళిత ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించారని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు దుయ్యబట్టారు. శుక్రవారం సాయంత్రం కోట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎన్‌డీసీసీబీ మాజీ వైఎస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీలో చేరుతున్న ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ, టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో వారితోపాటు బీజేపీ నాయకులు పురుషోత్తమరెడ్డి, కోటేశ్వరరావు, రమేష్‌బాబు, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

డక్కిలిలో వైసీపీకి ఎదురుదెబ్బ

- ఆ పార్టీకి కీలక నేతలు గుడ్‌బై
- ర్యాలీగా వచ్చి టీడీపీలో చేరిక
- కిలోమీటరు పొడవున జనమే జనం





నాయకుల ర్యాలీ - టీడీపీలో చేరిన వైసీపీ నేతలు - కురుగొండ్ల, మాధవనాయుడు, గంగోటికి గజమాల సత్కారం





వేమాను బ్రదర్స్‌తో కురుగొండ్ల

డక్కలి, ఏప్రిల్ 19: మండలంలో వైసీపీకి ఎదురు దెబ్బ తగిలింది. వైసీపీ కీలక నేతలంతా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు శాలువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. డక్కిలి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖరరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రంగినేని రాజ, డి. వడ్డిపల్లి సర్పంచ్ వి.చెంచమ్మ, యువరాజ్, రాములు, మాధవాయపాళెం సర్పంచ్ మాధవరెడ్డి, లింగసముద్రం మాజీ సర్పంచ్ వేముల నాగభూషణం నాయుడు, దేవులపల్లి వైసీపీ నేత వెంకట్రామిరెడి, మాదమాల శివారెడ్డి, దండవోలు మస్తాన్‌రెడ్డి, నడింపల్లి సర్పంచ్ ఏఎం రత్నంతో పాటు సంగనపల్లి, వెలికల్లు, కొత్తపల్లి, దేవులపల్లి, నాగవోలు, కెబిపల్లి, పలుగోడు, నాగులపాడు, తిమ్మాయపాళెం తదిత గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. వీరంతా డక్కిలి చెరువుకట్ట నుంచి రామకృష్ణతో బయలు దేరి సభా ప్రాంగణానికి చేరుకొన్నారు. దారి పొడవునా కాబోయే సీఎం చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు.

పార్టీలో చేరిన వారందరికీ గుర్తింపు

వైసీపీని కాదనుకొని టీడీపీలోకి వచ్చిన వారందరికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వైసీపీ ముఖ్యనేతలు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరడం శుభపరిణామన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ... వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు టీడీపీ హయాంలోనే అభివృద్ధి చెందాయన్నారు. చెరువులు, రోడ్లతో పాటు పలు సంక్షేమ పథకాలు టీడీపీ హయాంలోనే ప్రజలకు అందాయన్నారు. ఇవాళ పార్టీలో చేరిన వారందరికి తాను, తన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ఎళ్లవేళల అందుబాటులో ఉండి వారికి అండగా నిలుస్తామన్నారు. టీడీపీలోకి భారీగా వలసలు రావడంతో మండలంలో వైసీపీ ఖాళీ అయ్యిందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి, తన కుమార్తె లక్ష్మీసాయిప్రియకు సైకిల్ గుర్తుకి, తిరుపతి పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు కమలం గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వెంపటి మాధవనాయుడు మాట్లాడుతూ... వెంకటగిరిలో టీడీపీకి వస్తున్న జనాదరణ చూసి ప్రత్యర్థి వైసీపీలో వణుకు మొదలైందన్నారు. పొడిపించుకోవడం, సానుభూతి కోసం కిరాయి మనుషుల చేత గురకరాళ్లవేయించుకోవడం సీఎంకు అలవాటైపోయిందన్నారు. జన్ని రమణయ్య, ఏ.రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి వెంకటరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, నాయకులు చెలికం భాస్కరరెడ్డి, కేవీకే ప్రసాదనాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, పాయశం గోనపాల్, చెలికం మధురెడ్డి, పొట్టా మునెయ్య, పిపి చౌదిరి, ఆలూరు దామోదర నాయుడు, డక్కిలి పెంచలరెడ్డి, చింతమాను వెంకటపతి, చింతమాను పెంచలయ్య పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గూడూరు, ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆసుపత్రుల్లో అగ్నిమాపకశాఖ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి చలమయ్య మాట్లాడుతూ... అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆసుపత్రులలో తప్పనిసరిగా ఫైర్ సెఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

REAL ESTATE

» Ready to occupy 1/2 acre gated converted ekhata 15 fully furnished rooms garden 9Cr, Nandi Hills Road, Bengaluru. Ph: **9677002197**

AJB -182075

WANTED

నెల్లూరులోని "కోమల విలాస్" హోటల్ నందు పని చేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన స్త్రీలు, క్యాషియర్ కావలెను. సమయం: 11.00 AM to నుంచి 4.00 PM. సం.ప్ర. సెల్: 98496 56370, 79896 85059

AJR-178073

పొలం అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కొండాపురం మండలం, ఆదిమూర్తిపురం గ్రామం లోని పొలం య. 2. 10½ సెంట్లు అమ్మబడును. సంప్ర॥ సెల్ నెం: **9177372555.**

AJO-183734

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



అట్టహాసంగా విజయశ్రీ నామినేషన్

తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు



ఆర్వోకు నామినేషన్ అందిస్తున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 19: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ ఎన్నికల పర్వంలో తొలి అడుగు అట్టహాసంగా పడింది. ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, నాయకులు జనసందోహం మధ్య సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వోకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. విజయశ్రీ వెంట మాజీ మంత్రి పరసా, టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరణి విజయభాస్కర్ రెడ్డి ఉన్నారు. ముందుగా ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్ ఇంటి నుంచి నెలవల సుబ్రమణ్యం సహా పలువురు టీడీపీ నేతలు వాహనాల్లో ర్యాలీగా బయలుదేరి టీడీపీ కార్యాలయానికి చేరుకొన్నారు. అక్కడినుంచి టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బాపూజీ వీధి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసినంతరం విజయశ్రీ మీడియాతో మాట్లాడుతూ... ఇది తన గెలుపునకు, నియోజకవర్గ అభివృద్ధికి తొలి మెట్టన్నారు. నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ... జగన్ ఐదేళ్ల పాలనలతో విధ్వంసాలు, బెదిరింపులు, అరాచకాలు తప్ప ఒరిగిందేమి లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, పట్టణ అధ్యక్షుడు రమేష్, మాధవనాయుడు, వేమసాని శ్రీనివాసుల నాయుడు, కామిరెడ్డి మురళి రెడ్డి, బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు ప్రత్యేక పూజలు

నాయుడుపేట: పట్టణంలోని పాత బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి పాదాల వద్ద నామినేషన్ పత్రాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. విజయశ్రీ, పార్ధసారధి దంపతులు, నెలవల సుబ్రహ్మణ్యం, అమృత తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

బాలాయపల్లి, ఏప్రిల్ 19: సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు అన్నారు. జయంపు గ్రామంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్ రావు ఇంట్లో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నేతల సమావేశంలో లక్ష్మీసాయిప్రియ, వి.వరప్రసాద్‌రావును గెలిపించుకుందామన్నారు. రాయి సత్యంనాయుడు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.